

కాలుష్య కాసారం.. కృష్ణా కాల్వ

సాగునీటితో పాటు వేల ఎకరాల్లో సాగుకు ఆధారమైన కృష్ణాకాల్వ కాలుష్య కాసారంలా మారింది. ఏలూరు వట్లూరు నుంచి తూర్పులాకుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు, పాలిథిన్ సంచులతో డంపింగ్ యార్డులా మారింది. గుర్రపుడెక్క పేరుకు పోయి నీరు ముందుకు కదల్లేని పరిస్థితి. కలుషిత ఈ జలాలనే మంచినీళ్లుగా తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో దీనివైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. -8లో



ఏలూరు నగరంలో శాంతి ర్యాలీ

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, స్వామిజీల అక్రమ అరెస్ట్‌లను నిరసిస్తూ బుధవారం ఏలూరులో హిందువులు, హిందు జాగృత సమితి ప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కలెక్టరేట్ వద్దకు చేరుకుని దర్నా నిర్వహించారు. డీఆర్వోకు కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామచౌదరి, ఆర్టీసీ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. -8లో

అప్పుల విషయం బయటకు వస్తే..

పరువు పోతుందని మహిళ ఆత్మహత్య

మండవల్లి డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బడ్డీకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్న ఆ మహిళ తాను చేసిన అప్పుల విషయం బయటకు వస్తే పరువు పోతుందని.. భర్తకు తెలిస్తే ఏమౌవుతుందోనని భయపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండవల్లి మండలం లోకుమూడిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన మత్తే సుజాత (44) గ్రామంలో బడ్డీకొట్టు నిర్వహిస్తోంది. ఇటీవల గ్రామంలో కొంతమంది తెలిసినవారి దగ్గర, ప్రైవేటు ఫైనాన్స్‌ల్లోనూ భర్తకు తెలియకుండా అప్పులు చేసింది. ఈ క్రమంలో అప్పులు ఇచ్చినవారు ఇంటికి వచ్చి డబ్బులు కట్టమని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే గ్రామ పెద్దలు, ఆమె భర్త దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. గ్రామపెద్దల్లో పెడితే పరువు పోతుందని భావించిన ఆమె బుధవారం ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకుంది. దీనిని గమనించిన స్థానికులు మంటలు ఆర్పి సుజాతను కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆస్పత్రి నుంచి అందిన ఫిర్యాదు మేరకు మండవల్లి ఎస్‌ఐ రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త పేతురు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : కలెక్టర్

పెదవేగి/దెందులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించినప్పుడే రహదారి ఎక్కువకాలం మన్నికతో ఉంటుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. పెదవేగి మండలం ముండూరు వద్ద, దెందులూరు మండలం శ్రీరామవరంలో నిర్మించిన రహదారుల నాణ్యతను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. రహదారి నిర్మించిన విధానం, తీసుకున్న జాగ్రత్తలు, పాటించిన నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి నిర్మాణాలను మరింత వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ మోషే, ఏఈ మద్దాల శేషు కుమార్, అధికారులు ఉన్నారు.



పోలింగ్‌కు బాక్సులతో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

నేడే పోరు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం



కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు

- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్
- కలెక్టరేట్‌లో లైవ్ వెబ్‌క్యాస్టింగ్
- అక్కడే కంట్రోల్ రూముల ఏర్పాటు
- ఓటు ఉన్న ఉపాధ్యాయులకు నేడు స్పెషల్ క్యాజువల్ లీవ్
- పోలింగ్ నిర్వహణకు 144 మంది సిబ్బంది

మొత్తం ఓటర్లు : 2667
పోలింగ్ కేంద్రాలు : 20
బ్యాలెట్ బాక్సులు : 61
ఏలూరులో అత్యధిక ఓటర్లు : 896
కుక్కునూరులో అత్యల్ప ఓటర్లు : ఆరుగురు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ నేడు జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరగనుంది. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ సామగ్రిని జిల్లాలోని 20 పోలింగ్ కేంద్రాలకు సిబ్బందికి అందించారు. పకడ్బందీగా పోలింగ్ ప్రక్రియ ఆసాంతం కొనసాగాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ వెట్రిసెల్వి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. జిల్లా అంతటా 144 సెక్షన్ విధించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నేడు పోలింగ్ జరగనుంది. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పకడ్బందీగా సాగేలా ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లా కేంద్రం నుంచి పోలింగ్ సామగ్రిని వివిధ చోట్ల ఉన్న 20 పోలింగ్ కేంద్రాలకు బుధవారం తరలించారు. ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెట్రి సెల్వి దగ్గరుండి పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా 61 బ్యాలెట్ బాక్సులను సిద్ధంగా ఉంచగా మరో 10 బ్యాలెట్ బాక్సులు అదనంగా సంసిద్ధం చేశారు. పోలింగ్ సిబ్బందిని పూర్తిగా అప్రమత్తం చేశారు. మైక్రో అబ్జర్వర్లను నియమించారు.

పోలింగ్ సాగేదిలా..

జిల్లాలో 20 చోట్ల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా గురువారం ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ఆరంభిస్తారు. అంతకంటే రెండు గంటలు ముందుగానే పోలింగ్ సిబ్బందిని సన్నద్ధపరుస్తారు. ఈ ప్రక్రియ పక్కాగా జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కోటదిబ్బ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి తరలింపు కేంద్రాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి దగ్గరుండి పర్యవేక్షించారు. బ్యాలెట్ బాక్సులను ఏజెంట్ల సమక్షంలోనే సిద్ధం చేయడం, పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులను సీల్ వేసే సందర్భంలోను ఏజెంట్లు దగ్గరుండేలా చూడాలని ఆదేశించారు. సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఏమైనా అంశాలు ఉంటే అధికారులను తక్షణమే సంప్రదించాల్సిందిగా ఆదేశించారు. మరోవైపు ఎట్టి పరిస్థితుల్లోను పోలింగ్ ప్రశాంతంగా ముగిసేలా అన్ని పోలింగ్ కేంద్రాల్లోను అధికారులు స్పందించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ సజావుగా సాగేందుకు 144 మంది సిబ్బందిని నియమించారు. 24 మంది మైక్రో అబ్జర్వర్లను అందుబాటులో ఉంచారు. కలెక్టరేట్‌లో వెబ్‌క్యాస్టింగ్ పరిశీలనకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ఏలూరు కలెక్టరేట్‌లోనే ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు ఓటు వేసేందుకు వీలుగా స్పెషల్ క్యాజువల్ లీవ్‌కు గురువారం అనుమతించారు.

పొరపాట్లకు తావివ్వకండి : కలెక్టర్

శిక్షణలో తెలిపిన విధంగా పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విధులు నిర్వహించాలని ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని, ఈ ప్రక్రియను మైక్రో అబ్జర్వర్లు క్షుణ్ణంగా పరిశీలించి అన్ని అంశాలను నివేదిక రూపంలో సమర్పించాల్సిందిగా కోరారు. పోలింగ్ కేంద్రం బయట పోలింగ్ ఏరియా తెలిపే వివరాలు, పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా, పోలింగ్ కేంద్రం వద్ద చేయవలసినవి, చేయకూడనివి వంటి వివరాలతో పోస్టర్లు ఉండాలని సూచించారు. 'ఏలూరు డివిజన్ పరిధిలో పలు పోలింగ్ కేంద్రాలకు ముగ్గురు జోనల్ అధికారులు, మరో ముగ్గురు రూట్ ఆఫీసర్లను నియమించాం. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సహాయపడేందుకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశా'మని తెలిపారు.



బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఓటర్ల వివరాలు ఇవీ..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 పోలింగ్ కేంద్రాల్లో 2,667 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. అత్యల్పంగా కుక్కునూరు పోలింగ్ కేంద్రంలో ఆరుగురు ఓటర్లే ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో వేలేరుపాడులో కేవలం 11 మంది ఓటర్లు ఉన్నారు. ఏలూరురూరల్ పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 896 మంది ఓటర్లు ఉన్నారు. జీలుగుమిల్లి 70, బుట్టాయిగూడెం 339, పోలవరం 103, కొయ్యలగూడెం 113, జంగారెడ్డిగూడెం 273, టి.నర్సాపురం 35, కామవరపుకోట 55, ద్వారకాతిరుమల పోలింగ్ కేంద్రంలో 69 మంది ఓటర్లు ఉన్నారు. చింతలపూడి పోలింగ్ కేంద్రంలో 232, లింగపాలెం 48, ఉంగుటూరు 69, భీమడోలు 91, పెదవేగి 65, పెదపాడు 72, ఏలూరుఅర్బన్‌లో 896, ఏలూరురూరల్ 16, దెందులూరు 77, నిడమర్రు పోలింగ్ కేంద్రం 27 మంది ఓటర్లు ఉన్నారు. ఏలూరుఅర్బన్, చింతలపూడి, బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం పోలింగ్ కేంద్రాల్లోనే ఓటర్ల సంఖ్య మూడంకెలు దాటింది. ఈ నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లోను పోలింగ్ సజావుగా సాగేలా బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుమతి లేనిదే పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లు మినహా ఎవరినీ అనుమతించరు. ఎప్పటికప్పుడు పక్కాగా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తూనే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించారు.

ఓటుహక్కు ఉన్నవారికే ప్రత్యేక సాధారణ సెలవు

ఏలూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల ఎన్నిక 5వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఓటు ఉన్న ఉపాధ్యాయులకు మాత్రమే ఓటుహక్కు వినియోగించేందుకు ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. దీనికి సంబంధించి 5వ తేదీన ప్రత్యేక సాధారణ సెలవు ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆమె తెలిపారు. ఎంఈవోలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రత్యేక సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఓటుహక్కు ఉన్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి ఓటుహక్కు వినియోగించుకోవ డానికి అనుమతి ఇవ్వాలన్నారు. ఎవరైనా ఆరోజు విధులకు ఆలస్యంగా వచ్చినా అనుమతించాలని డీఈవో ఆదేశించారు.



భూప్రకంపనలు

ఏలూరు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం స్వల్పంగా భూమి కంపించడంతో ప్రజలంతా ఉలిక్కిపడ్డారు. చాలా చోట్ల వంట గదుల్లో పాత్రలు జారి కిందపడ్డాయి. సాధారణంగా ఈ మధ్య కాలంలో ఇలాంటి ప్రకంపనలు రావడం ఇదే ప్రథమం. భూకంప తీవ్రత జిల్లాపై పెద్దగాలేదని, స్వల్పంగా ప్రకంపనలు మాత్రమే వచ్చినట్టు అధికార వర్గాలు ప్రకటించాయి. -7లో

ట్రిపుల్ ఐటీకి.. రూ.15 లక్షలు కుచ్చుటోపీ

- ఎనిమిదేళ్లుగా అద్దె చెల్లించని వైసీపీ కార్యకర్త
- మరొకరి పేరుతో షాపు నిర్వహణ
- లబోదిబోమంటున్న నోటీసు అందుకున్న వ్యక్తి



ట్రిపుల్ ఐటీ నుంచి నోటీస్ అందుకున్న బాధితుడు అమర్‌నాథ్‌కుమార్

నూజివీడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని నూజివీడు ట్రిపుల్ ఐటీలో వివిధ షాపులు (ఫ్యాన్సీ, ఫుడ్‌కోర్టు, స్టేషనరీ) నిర్వహించిన వైసీపీ స్థానిక నాయకులు నూజివీడు ట్రిపుల్ ఐటీకి లక్షలాది రూపాయల అద్దె బకాయిలు చెల్లించలేదు. అంతేకాదు బినామీ పేరుతో సదరు వ్యక్తికి తెలియకుండానే అతని పేరుతో షాపు నిర్వహించి లక్షలాది రూపాయల అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో, అతనికి (బినామీ)వ్యక్తికి నూజివీడు ట్రిపుల్ ఐటీ అధికారులు అద్దె బకాయి చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలివి.. నూజివీడులో విజయ ఫ్యాన్సీ అండ్ కాపీవర్క్స్ నిర్వహించుకుంటున్న పేర్ల అమర్‌నాథ్ కుమార్ అనేవ్యక్తికి నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి మీరు 15 లక్షల 58 వేల అద్దె బకాయి చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని, లేకపోతే మీపై చర్యలు తీసుకుంటామంటూ నోటీస్ అందింది. దీంతో అమర్‌నాథ్‌కుమార్ లబోదిబోమంటూ, ట్రిపుల్ ఐటీలో ఎలాంటి వ్యాపారం చేయని తనకు ఈ నోటీస్ ఏమిటంటూ ట్రిపుల్ ఐటీకి వెళ్లి ఆరా తీయగా నూజివీడు ట్రిపుల్ ఐటీలో తన పేరు, అడ్రస్‌తో ఫ్యాన్సీ షాపు వ్యాపారం చేసినట్టు ట్రిపుల్ ఐటీ రికార్డుల్లో ఉండడంతో ఖంగుతిన్నాడు. వెంటనే నూజివీడు పోలీసులకు, మంత్రి, నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని కలిసి బుధవారం ఫిర్యాదు చేశాడు. మంత్రి ట్రిపుల్ ఐటీ అధికారులను ఫోన్‌లో సంప్రదించి విచారణ చేయాలని ఆదేశించారు.

రూ.10 కోట్లు టర్నోవర్..?

పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం అమర్‌నాథ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలో తాను ఆరా తీయగా శీలం సాంబశివరావు అనే వ్యక్తి గత ఎనిమిదేళ్లుగా క్యాంపస్‌లో షాపు నిర్వహిస్తూ ట్రిపుల్ ఐటీకి అద్దె చెల్లించకపోవడమే కాక జీఎస్టీ, సేల్స్‌ట్యాక్స్‌ను సైతం ఎగ్గొట్టాడని తెలిసిందన్నారు. ఈ ఎనిమిదేళ్లల్లో సుమారు రూ.10 కోట్ల వరకు టర్నోవర్ జరిగి ఉంటుందని ఆయన తెలిపారు. కాగా శీలం సాంబశివరావు అనేవ్యక్తి నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు అత్యంత సన్నిహిత నాయకుడికి సమీప బంధువు కావడం గమనార్హం.

నోరు మెదపని అధికారులు

రెండేళ్లకు ఒకసారి క్యాంపస్‌లో షాపులకు, మెస్‌లకు టెండర్లు నిర్వహించాల్సి ఉండగా, వైసీపీ పాలనలో ఈ నిబంధనలకు అధికారులు తిలోదకాలు ఇచ్చారు. వైసీపీ నాయకులు చెప్పిన వారికే ఉద్యోగాలు, మెంటార్ ఉద్యోగాలను ట్రిపుల్ ఐటీ అధికారులు ఇచ్చేశారు. అద్దె బకాయిలు ఉంటే ఏళ్ల తరబడి ఎందుకు నోటీసులు ఇవ్వకుండా, అద్దె వసూలు చేయకుండా కాలయాపన చేశారో, ట్రిపుల్ ఐటీ అధికారుకే తెలియాలి. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహించిన షాపులు, ఫుడ్ కోర్టులు సైతం లక్షలాది రూపాయలు అద్దె బకాయిలు ఉన్నమాట వాస్తవం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల నిర్వాహకులను ట్రిపుల్ ఐటీ అధికారులు మార్చారు. నిబంధనల ప్రకారం ఇప్పుడు అద్దె బకాయిలు చెల్లించాలని కోరుతూ నోటీసులు జారీ చేస్తున్నారు.

ఇప్పుడూ అదే తంతు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడిచినా ట్రిపుల్ ఐటీలో మెస్‌లకు, షాపులకు టెండర్లు పిలువకుండానే నిర్వాహకులు మారిపోయారు. ఇటీవల మెస్‌ల్లో భోజనం బాగాలేదని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు పెద్దఎత్తున నిరసనలు తెలిపిన విషయం విదితమే. పలువురు రాష్ట్ర ఉన్నతాధికారులు ట్రిపుల్ ఐటీని సందర్శించి వెంటనే మెస్‌లకు టెండర్లు పిలవాలని ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం షాపుల నిర్వహణ కూడా టీడీపీ సానుభూతిపరులకే అందాయన్న ప్రచారం జరుగుతోంది. వీరైనా సక్రమంగా అద్దెలు చెల్లిస్తారా? లేదా? వైసీపీ బాటనే అనుసరిస్తారా? అనేది కొద్దినెలల్లో తేలిపోతుంది.



అమర్‌నాథ్‌కుమార్ ఫిర్యాదుతో ట్రిపుల్ ఐటీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

బాబూ..చూస్తున్నారా?



గన్ని
మురళి
శేషు

పార్టీ అధికారంలోకి వచ్చేందుకు భౌతికంగా, ఆర్థికంగా నష్టపోయినా, అక్రమ కేసులు, వ్యక్తిగత ఒత్తిళ్ల తోడైనా వెన్నుచూపకుండా ఎందరో ఎదురొడ్డి నిలిచారు. కూటమి పొత్తుల ఫలితంగా ఎమ్మెల్యే స్థానం నుంచి పోటీకి తప్పుకున్న వారు మరికొందరు. కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందంటూ పార్టీ అధినేత చంద్రబాబు వీరందరికీ భరోసా ఇచ్చారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ జరుగుతున్నా ఆ జాబితా చాలా మందికి నిరాశే మిగిలుస్తోంది. బాబుగారు.. మమ్మల్ని చూస్తున్నారా.. అనే ప్రశ్నే అందరినీ కంటిపై కునుకు లేకుండా చేస్తోంది.

- నామినేటెడ్ పదవుల కోసం ఆశలు
- కష్టపడ్డాం కనికరించండంటూ అధిష్ఠానానికి విజ్ఞప్తి
- నాల్గవ జాబితాపైనే అందరి దృష్టి
- గన్ని, ఘంటాతో సహా అనేక మంది ఎదురుచూపులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ శరవేగంగానే సాగుతోంది. కూటమిలో ఉన్న భాగస్వామ్య పక్షాలకు చెందిన అనేకమందికి నామినేటెడ్ స్థానాల్లో అవకాశం లభిస్తోంది. అయితే తెలుగుదేశంలో ఉన్న సీనియర్లు, కార్యకర్తల్లో ఇప్పటికీ పూర్తిస్థాయి సంతృప్తి మిగల్చలేదు. వీరిలో మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు అనేక మంది ఉన్నారు. కొత్తవారికి అవకాశం అనే నినాదం బాగానే ఉన్నా సీనియర్లుగా తమకు తగిన స్థానం ఇవ్వాల్సిందనే విషయాన్ని పార్టీ మరిచిపోకూడదని భావిస్తున్న వారే అత్యధికులు. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి రెండుసార్లు పోటీ చేసి ఒకసారి గెలుపొందిన, ప్రస్తుత టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అనుకూలురు ఇప్పుడు తమ నేత విషయంలో జరుగుతున్న జాప్యంపై కాస్తంత ఆగ్రహంగానే ఉన్నారు. ఉంగుటూరు నియోజకవర్గాన్ని కూటమిలో భాగంగా జనసేనకు కేటాయించడంతో ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం గత ఎన్నికల్లో గన్ని కోల్పోయారు. అప్పట్లో చంద్రబాబు.. 'మీకు కచ్చితంగా పార్టీపరంగా న్యాయం చేస్తా. ప్రస్తుతం పార్టీ అధికారంలోకి వచ్చేలా అందరూ సహకరించాలి. మీ విషయం నేను చూసుకుంటా' గన్నికి గట్టి భరోసానే ఇచ్చారు. ఒక దశలో ఆయనకు ఎమ్మెల్సీ స్థానం ఖాయమంటూ ప్రత్యేకంగా సంకేతాలు అందాయి. తాజాగా వైసీపీకి చెందిన జయమంగళ వెంకటరమణ తన ఎమ్మెల్సీ పదవిని త్యాగం చేయాల్సి వస్తే అది గన్నికి కేటాయిస్తారంటూ విస్తృత ప్రచారం సాగింది. దీంతో కేడరంతా తెగ మురిసిపోయింది. కాని ఆ సీనంతా రివర్స్ అయ్యి జయమంగళ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినా గన్నికి బదులుగా వేరొకరికి అవకాశం మెరుగుపడింది. ఇప్పుడు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవ్వాలంటే మరో రెండేళ్లు ఆగాల్సిందే. ఈలోపే పార్టీ బాధ్యతలు మోస్తున్న తమ నాయకుడికి ప్రత్యేకంగా గౌరవం దక్కేలా పార్టీ తగిన పదవి ఇస్తుందని ఇప్పటివరకు భావించారు. కాని టీడీపీ అధినాయకత్వం ఈ దిశగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. తాజాగా నాల్గవ విడత నామినేటెడ్ స్థానాలను భర్తీ చేస్తామని ఈ మధ్యనే సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో కొంతలో కొంత మళ్లీ తిరిగి ఆశలు మొదలయ్యాయి. 'పార్టీ అన్నీ చూస్తోంది. నేనేమి త్యాగం చేశానో.. పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాలకు నేను ఎలా బద్ధుడినో అందరికీ తెలుసు. తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని నమ్మకం నాకు ఉంది' అంటూ గన్ని అసంతృప్తితో ఉన్న తన కేడర్‌ను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు.

మరి మా సంగతేంటి..?

ఇప్పటివరకు భర్తీ అయిన నామినేటెడ్ పోస్టుల్లో ఒకరిద్దరికి మాత్రమే చైర్మన్ హోదాలో పదవి దక్కింది. టీడీపీ పక్షాన పోలవరంలో జనసేన పోటీ చేసేందుకు వీలుగా రంగంలో తప్పుకున్న టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌కు ట్రైకార్ చైర్మన్ పదవి లభించింది. ఏలూరులో ఎమ్మెల్యే సీటు ఆశించిన జనసేన నేత రెడ్డి అప్పలనాయుడుకు ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పదవి దక్కింది. జిల్లా వ్యాప్తంగా వీరిద్దరితోపాటు మరో ముగ్గురికి డైరెక్టర్ హోదాలు లభించాయి. పార్టీపరంగా చింతలపూడిలో శ్రమించి కష్టపడిన నేతలెందరో తమకూ గుర్తింపు వస్తుందని ఆశతోనే ఉన్నారు. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పార్టీ కోసం కష్టించి పనిచేశారు. ఆయనతోపాటు తెలుగుదేశం అధికార ప్రతినిధి శేషు, ఆయన అనుచరవర్గం ఏదొక నామినేటెడ్ పోస్టు దక్కుతుందని ఇన్నాళ్లు ఆశతోనే ఉన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వాడే కాకుండా ఉన్నత విద్యావంతుడు కావడంతో ఆయనకు తొలి లేదా మలి నామినేటెడ్ జాబితాల్లో చోటు దక్కుతుందని అంతా భావించారు. కాని అది సాధ్యం కాలేదు. ఇప్పుడు తాజాగా మరో విడత నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ నాల్గవ విడత జాబితా కొద్ది రోజుల్లోనే వెలువడనుంది. ఈ జాబితాలో తమ కష్టాన్ని, సేవను గుర్తించి తగిన అవకాశం ఇవ్వాలని శేషు అభ్యర్థిస్తున్నారు. నూజివీడు, కైకలూరు ప్రాంతాలకు చెందిన అనేక మంది ఇదే విజ్ఞప్తి చేస్తున్నారు. ఏలూరులో ఈడా చైర్మన్ పదవిని ఆశిస్తున్న కంప్యూటర్ ప్రసాద్, శివప్రసాద్, ఎంఆర్డీ బలరాం ఈశ్వరి ఈసారి జాబితాలో తమ పేరు ఉండకపోతుందా అనే ఆశతో ఉన్నారు. ఏలూరుకు చెందిన కడియాల విజయలక్ష్మి, కొయ్యలగూడెంకు చెందిన మేఘలాదేవి నామినేటెడ్ పోస్టుపై ఆశతో ఉన్నారు. పోస్టుల భర్తీలో మాకూ ఓ అవకాశం దక్కేలా చూడండం టూ అనేక మంది ఇప్పటికే పెద్ద ఎత్తున పార్టీ అధినాయకత్వానికి దరఖాస్తులు, మెయిల్ రూపంలో విజ్ఞప్తులు పంపారు.


మొదటి ..ద్వితీయ బహుమతి అందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాలిటెక్ ఫెస్ట్ విజేతలకు బహుమతులు

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నికల్ రీజనల్ స్థాయి పాలిటెక్ ఫెస్ట్- 2024 విజేతగా భీమవరం సీతా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన మల్టిపర్పస్ రోబో నిలిచింది. తాడేపల్లిగూడెంలో నిర్వహించిన టెక్‌ఫెస్ట్ విజేతలను పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జిల్లా కోఆర్డినేటర్ డి.ఫణీంద్ర ప్రసాద్ బుధవారం ప్రకటించారు. మొదటి బహుమతి విజేతలకు రూ.25 వేలు, తాడేపల్లిగూడెం శశి పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రదర్శించిన లైఫై, తణుకు పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రదర్శించిన మోడల్ సబ్‌స్టేషన్‌కు సంయుక్తంగా రెండో బహుమతి ప్రకటించారు. వారికి రూ.10వేలు అందించారు. మొత్తం 42 ప్రాజెక్టులు ప్రదర్శించగా వాటిలో 17 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాయి.

సుబ్రహ్మణేశ్వరస్వామికి రూ.5 లక్షలు విలువ చేసే వెండి ఆభరణాలు



నరసాపురం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పర్రు గ్రామంలో కొలువైన వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామికి రూ.5 లక్షలు విలువ చేసే వెండి వస్తువులు బహూకరించారు. గ్రామానికి చెందిన జనసేన సీనియర్ నాయకులు పొలిశెట్టి శ్రీనివాస్ సునీత దంపతులు స్వామివారికి వెండి కవచం, ఐదు పడగలు కలిగిన వెండి సర్పము బహూకరించారు. అంతకు ముందు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించారు.



క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న రంగసాయి తదితరులు

కరాటేలో అనాథాశ్రమ విద్యార్థులకు పతకాలు

భీమవరం క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌కు మలేషియా వెళ్ళి వచ్చిన అనాథాశ్రమ విద్యార్థులకు భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్రీడల్లో కరాటే మహా ఆసక్తి కలిగిన క్రీడ అని చిన్నారులు కరాటే శిక్షణ పొంది అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకాలు సాధించడం గొప్ప విశేషమన్నారు.

భీమవరం ఇమ్మానుయేలు అనాథ ఆశ్రమంకు చెందిన విద్యార్థులు అశ్విని, ప్రియ, జెర్సీలు ఇటీవల మలేసియాలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకం, సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. కోచ్ భాస్కరరావు మాట్లాడుతూ మూడేళ్ళుగా ఈ విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని, మలేషియా పోటీలకు వివిధ దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా 16 మంది మాత్రమే తుదిపోరుకు వచ్చారని వారిలో ఈ ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు, సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. అనాథ ఆశ్రమం నిర్వాహకులు ఎన్ఎస్ పాల్, పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ పోటీలకు వెళ్ళడానికి దాతలు ఎంతో మంది సహకరించారని, త్వరలో ఒలింపిక్స్‌కు వెళ్ళడానికి అందరి సహకారం కావాలని కోరారు.

నిషేధిత ఆక్వా మందులు అమ్ముతున్న దుకాణాలపై కేసులు

గణపవరం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): గణపవరంలో నిషేధిత ఆక్వా మందులు విక్రయిస్తున్న దుకాణాలపై ఔషధ నియంత్రణ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం గణపవరంలోని ఆక్వా దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేయగా నిషేధిత మందులు గుర్తించి రెండు దుకాణాలపై కేసు నమోదు చేశామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబీద్ అలి తెలిపారు. ఇప్పటికే నిషేధిత మందులు వాడడం వల్ల ఆక్వా ఎగుమతుల్లో రైతులు నష్టాలు చవి చూడాల్సి వస్తోంది. ఈ తరుణంలో దాడులు నిర్వహించటం చర్చనీ యాంశంగా మారింది.


షాపు తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబీద్ అలి

నిషేధిత మందులు వాడినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పొగాకుపై కొత్త ఆశలు



ఎన్ఎల్ఎస్ పరిధిలో పొగాకు నాట్లు వేగంగా జరుగుతున్నాయి. మూడు సంవత్సరాలుగా అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు మంచి ధర పలకడంతో రైతులు అదే ఉత్సాహంతో ఈ సంవత్సరం పొగాకు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. గత మూడేళ్లలో పొగాకు సాగులో మంచి లాభాలు కనిపించడంతో ఈ ఏడాది ఎకరానికి రూ. 80 వేల నుంచి రూ.లక్షా ముప్పై వేలవరకు వెచ్చించి కౌలుకు తీసుకుంటున్నారు. పలువురు రైతులు తమ పొలాల్లో ఉన్న పామాయిల్ చెట్లను నరికించి ఆ భూమిలో పొగాకు పంట వేస్తున్నారు.

- వేగంగా పొగాకు నాట్లు
- రాజమండ్రి రీజియన్ పరిధిలో 21,226 హెక్టార్లలో సాగు
- మూడేళ్లుగా ఆశాజనకంగా వర్జీనియా పొగాకు ధరలు
- ఈ ఏడాది అధికంగా సాగుకు సిద్ధం
- పెరిగిన బ్యారన్ లైసెన్సులు, కౌలు
- లిమిట్ దాటితే తిప్పలు తప్పవంటున్న అధికారులు
- అదనంగా పండిస్తే పెనాల్టీ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎల్ఎస్ పరిధిలోని రాజమండ్రి రీజియన్‌లో జంగారెడ్డిగూడెంలో రెండు వేలం కేంద్రాలు ఉండగా దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం పరిధిలో 12,863 మంది రైతులు ఉన్నారు. 14,861 లైసెన్సు బ్యారన్లు ఉన్నాయి.


పామాయిల్ తోట తీసి పొగాకు సాగు..

ఇప్పటి వరకు 21,226 హెక్టార్లలో పొగాకు నాట్లు వేశారు. గత సంవత్సరం 23800 హెక్టార్లలో పొగాకు పంట వేశారు. 2024-25 పంట కాలానికి 58.25 మిలియన్ల పొగాకు పండించడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. బ్యారన్‌లకు సంవత్సరానికి రూ.రెండు లక్షల డెబ్బై వేల నుంచి రూ.మూడు లక్షలకు లీజుకు తీసుకుంటున్నారు. గతంలో రూ.రెండున్నర లక్షలకు అమ్మిన బ్యారన్ ఇప్పుడు రూ.8 నుంచి పది లక్షల వరకు అమ్ముతున్నారు. పలు బ్యాంకులు రైతులను ఆకట్టుకోవడానికి ఒక బ్యారన్‌కు రూ.8 లక్షల నుంచి పది లక్షల వరకు రుణం ఇస్తామని ప్రకటించడంతో రైతులు రుణాలు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో పలువురు రైతులు ఎటువంటి అను మతులు లేకుండా అక్రమంగా ప్రజల ఇళ్ళ మధ్య బ్యారన్లు నిర్మిస్తున్నారు.

ఈ ఏడాదీ కలిసొచ్చేనా ?

గత మూడు సంవత్సరాలుగా పొగాకు ధరలు పరిశీలిస్తే 2021-22లో కిలో పొగాకు ఏవరేజ్ ధర రూ.191.74 , 2022-23లో రూ.248, 2023-24లో రూ.326.20 చొప్పున పెరుగుతూ వచ్చాయి. 2024లో నాణ్యత గల పొగాకుకు అధిక ధర రూ.410 పలకగా లోగ్రేడు పొగాకు అతి తక్కువ ధర రూ.50 పడింది. 2020 కరోనా తర్వాత నుంచి వరుసగా మూడు సంవత్సరాల పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో నాణ్యత కలిగిన పొగాకు అధికంగా పండించే బ్రెజిల్, జింబాబ్వేలో వాతావరణ మార్పుల వల్ల పొగాకు దిగుబడి బాగా తగ్గిపోయింది. ఇప్పటికీ కొన్ని దేశాలు ఆ దెబ్బ నుంచి కోలుకోలేదు. దీంతో డిమాండ్ పెరగడంతో అదే సమయంలో గిరాకీ ఏర్పడడం వల్ల అదే నాణ్యత కలిగిన పొగాకును పండించే భారతదేశం నుంచి ఎగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయి. అందువల్ల వరుసగా మూడు సంవత్సరాల పాటు దేశంలో పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర పలికింది. కానీ 2024-25 కాలంలో వర్జీనియా పొగాకుకు బ్రెజిల్‌లో 630 మిలియన్లు, జింబాబ్వేలో 300 మిలియన్ల పొగాకు పండించడానికి టార్గెట్ పెట్టుకున్నారు.

గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అంతర్జాతీయంగా మార్కెట్ అధికంగా ఉండడంతో ప్రపంచ మార్కెట్ అదనపు సరఫరాను ఎదుర్కొనే అవకాశం ఉంది. చిన్న చిన్న ఆఫ్రికా దేశాలైన టాంజీనియా వంటి దేశాలు నాణ్యత కలిగిన పొగాకును తక్కువ ఖర్చుతో పండిస్తున్నారు. కనుక రాజమండ్రి రీజియన్ పరిధిలో ఉన్న పొగాకు రైతులు ఈ ఏడాది బోర్డు అనుమతి ఇచ్చిన మేరకే పండించాలని అదనంగా పండించడం వల్ల చిక్కుల్లో పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

అనుమతి ఇచ్చిన మేరకే పండించండి



రీజియన్ పరిధిలో ఉన్న ఐదు వేలం కేంద్రాల పరిధిలో అనుమతులు లేకుండా బ్యారన్లు నిర్మించడం సరికాదు. ఇప్పటికే వారికి నోటీసులు జారీచేశాం. భారత దేశంలో మార్కెట్ స్థితిని రక్షించడానికి రెగ్యులేటెడ్ చట్ట ప్రకారం దేశీయ, విదేశీ అవసరాల ప్రకారం ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే ఈ సంవత్సరం పొగాకు పండిచాలి. నిబంధనలకు విరుద్ధంగా అదనంగా పండిస్తే పెనాల్టీ వేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఎనిమిదేళ్ళుగా రాజమండ్రి రీజియన్‌లో అధికమొత్తంలో నాణ్యమైన పొగాకు పండించాం. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగం ఏమాత్రం పెరగలేదు. డబ్ల్యూహెచ్‌వో ఆదేశాల మేరకు పొగాకును పండించే 176 దేశాలు పొగాకు అధికంగా ప్రోత్సహించకుండా లిమిట్‌లోనే పంట వేస్తామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ధరలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. కనుక రైతులు తమకు అనుమతి ఇచ్చిన మేరకే పొగాకు పండించాలి. ఈ సంవత్సరం ఏ భూమి పడితే ఆ భూమిని కౌలుకు తీసుకుని రైతులు పొగాకు పంట వేస్తున్నారు. అలా వేయడంవల్ల పంట దిగుబడి చాలా తక్కువగా వస్తుంది.

- జీఎల్‌కె ప్రసాద్, రీజనల్ మేనేజరు, రాజమండ్రి


ద్వారకాతిరుమలలో సుబ్రహ్మణ్యేశ్వరుని వరునిగా అమ్మవార్లను వధువులుగా అలంకరించి పూజలు చేస్తున్న అర్చకులు, పండితులు

వరుడైన సుబ్రహ్మణ్యేశ్వరుడు.. ప్రారంభమైన కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం సుబ్రహ్మణ్యేశ్వరుని పెండ్లి కుమారునిగాను, వల్లీ, దేవసేన అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. ఆలయాన్ని, పరిసరాలను పుష్పమాలికలు, అరటి బోదెలు, మామిడి తోరణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి అమ్మవార్ల మూర్తులను ఉంచి అలంకరించి వేడుకను ప్రారంభించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు. పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు పాల్గొన్నారు.

చలికాలం..జర జాగ్రత్త..



ఏలూరు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చలికాలంతో చల్లని వాతావరణం వణికిస్తుంది .పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయి. ఈ కాలంలో ఆహ్లాదం మాటున జబ్బులు కూడా పొంచి ఉంటాయి. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు చలికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. శీతాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధిన బారినపడే ప్రమాదాలు ఉన్నాయి. వర్షాకాలం నుంచి శీతా కాలంలోకి మారుతున్న నేపథ్యంలో అప్పటి వరకూ వర్షాకాల వాతావరణానికి అనుకూలంగా ఉన్న మానవశరీరం తిరిగి శీతాకాల పరిస్థితు లను తట్టుకునే విధంగా ఉండడానికి వ్యాధి నిరోధక శక్తి ఎంతో అవసరం. ఆ శక్తి లేనప్పుడు వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. శీతాకాలంలో చల్లనిగాలులు, మంచువల్ల ఊపిరితిత్తుల్లో నిమ్ము వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. నరాలు బలహీనపడి రక్త ప్రసరణకు ఇబ్బందులు రావచ్చు. సాధారణంగా 50 ఏళ్ల పైబడిన వారిలో గుండె సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిలో ఈ పరి స్థితులు నెలకొని ఉంటాయి. ప్రస్తుతం శీతాకాలం రావడంతో ఎక్కువ మంది కఫంతో కూడిన దగ్గు, గొంతు నొప్పి, జలుబు, జ్వరం, వంటినొప్పులు వంటివి లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. కొందరికి ఎలర్జీ ఉండడంతో శరీరంపై దద్దుర్లు, దురదలు వస్తూ ఉంటాయి. ఈ కాలంలో ఆయాసం, ఉబ్బసం ఉన్నవారికి ఇబ్బందులు అధికంగా ఉంటాయి. ఈ ఏడాది సాధారణ శీతాకాల ఉష్ణోగ్రతలు కన్నా మరింత తగ్గువగా ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని వాతావరణ పరిశోధన శాస్త్రవేత్తలు వెల్లడిం చడంతో ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి .

ఇవి పాటించండి

శీతాకాలంలో ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా మారుతూ ఉంటాయి. ముఖాన్ని వెచ్చగా ఉంచు కోవడానికి స్కార్ఫ్ లేదా మాస్క్ ధరించాలి. రోగనిరోధక శక్తి పెంచుకోవడానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. తగినంత నిద్ర పోవాలి. రోజుకు ఒక గంటపాటు వ్యాయామం లేదా నడక అయినా చేయాలి. దీనివలన రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చు. తగినంత నీరు తాగి శరీరాన్ని హైడ్రేట్ చేసుకోవాలి. జలుబు, జ్వరాలు ఉన్న వారికి దూరంగా ఉండడం ఎంతో మంచిది. ఆయాసం ఉన్న వారు ఆవిరి పట్టాలి. చిన్న పిల్లలకు చలిగాలి తగలనీయకూడదు. వారి శరీరం వెచ్చగా ఉండేందుకు ఎప్పుడూ వస్త్రాలను ధరింపజేసి ఉంచాలి. చిన్న పిల్లలకు ఏమైనా జలుబు, జ్వరం వస్తే ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుల వద్దకు తీసుకువెళ్ళాలి.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



చలికాలంలో జలుబు, దగ్గు రావడం సహ జమే. గోరు వెచ్చని నీటిని తాగాలి. చల్లని ఆహార పదార్థాలు తీసుకోక పోవడం మంచిది. కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీములు మానివేయాలి. సాధార ణంగా ఈ కాలంలో జలుబు, దగ్గు, వళ్ళు నొప్పులు, తల నొప్పి ఉంటే మూడు రోజుల పాటు పారాసెట్‌మాల్, సిట్రోజన్ టాబ్లెట్స్ వేసు కోవడం వల్ల సాధారణంగా అదుపులోకి వచ్చే స్తుంది. వైద్యులను సంప్రదించాలి. ఎట్టిపరి స్థితుల్లో యాంటీబయోటిక్స్ వినియోగించ కూడదు. చలి నుంచి కాపాడుకోవడానికి ఉన్ని దుస్తులను ధరించడం, చర్మం పొడిబారి పోకుండా మాయిశ్చరైజర్లు, నూనెలు రాసుకోవాలి. మంచులో కాకుండా మంచు తగ్గిన తరువాతే నడక, ఇతర వ్యాయామాలు చేయాలి. చలి గాలులు చెవులకు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.


డాక్టర్ హరికృష్ణ, సాధారణ, నరాల వ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులు, ఏలూరు

కార్మికుల సొమ్ము గల్లంతు !




ఏసురాజు తల్లి అన్నపూర్ణమ్మ

తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన అనక యేసురాజు బిల్డింగ్ పనిచేస్తుండగా గోడకూలి ప్రమాద స్థలంలోనే ఏప్రిల్ 13, 2024లో మృతి చెందాడు. దీంతో అతనిపై ఆధారపడి జీవిస్తున్న తల్లి అన్నపూర్ణ ఒంటరిదైంది. ఏసురాజుకు వైఎస్ఆర్ బీమా, ఈశ్రమ కార్డు పరిహారం ఏది రాలేదు. దీంతో కుటుంబం రోడ్డున పడింది.


రామలక్ష్మి

తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన అవురు రామలక్ష్మి కుమార్తె కూతురు ప్రసవానికి మే నెలలో 2019లో దరఖాస్తు చేసుకుంది. అసలు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి, బోర్డు నుంచి ఎలాంటి సాయం రాలేదు. ఇలా నాలుగేళ్లుగా భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నుంచి ఏ..సాయమూ అందక నానా అవస్థలు పడ్డారు.తమకు రావాల్సిన సంక్షేమ పథకాలను అందించాలని కోరుతున్నారు.


తణుకులోని కార్మిక శాఖ కార్యాలయం

- నిధులు మళ్లించిన వైసీపీ ప్రభుత్వం
- భవన నిర్మాణ కార్మికుల అవస్థలు
- నాలుగేళ్లుగా ఒక్క క్లెయిమూ పరిష్కారం కాలేదు
- రూ.3 కోట్లు పైనే బకాయిలు

తణుకు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు తమకు అందాల్సిన సంక్షేమ పథకాల కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. వీరు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కింది. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కాలంలో 3 కోట్ల 44 లక్షల 36 వేల రూపాయలు కార్మికుల పథకాలకు చెల్లించాల్సి ఉంది. కేవలం దరఖాస్తు చేసుకోవడం తప్ప ప్రభుత్వం నుంచి ఏమాత్రం సాయం అంద లేదని కార్మికులు వాపోతున్నారు. కేంద్రం కరోనా నేపథ్యంలో అందించిన సాయం కూడా తమకు ఇవ్వలేదని కార్మికులు వాపోతు న్నారు.జగన్ ప్రభుత్వం జీవో 17 ద్వారా మళ్ళించి కోర్టులను సైతం తప్పుదోవ పట్టించినట్టు కార్మి కులు చెబుతున్నారు. వెల్ఫేర్ బోర్డులో సభ్యత్వం కింద ప్రతి కార్మికుడు రూ. 50 చొప్పున చెల్లిస్తు న్నారు. అలాగే సంవత్సరానికి 12 రూపాయలు చొప్పున ఐదు సంవత్సరాలకు 60 రూపాయలు కార్మికులు చెల్లిస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వ ప్రవేటు భవనాల నిర్మాణ సమయంలో కార్మికుల సంక్షేమ బోర్డుకు 1 శాతం చెస్ చెల్లిస్తారు. ఇలా చెల్లించినది సుమారు వెయ్యి కోట్లు ఉన్నాయని ఇటీవల అసెంబ్లీలో మంత్రి సుభాష్ వెల్లడించారు. భవన నిర్మాణ కార్మికులు ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో అధికారిక లెక్కల ప్రకారం లక్షా 36 వేల 849 మంది ఉన్నారు. ఇంకా నమోదు కాని కార్మికులు సుమారుగా రెండు లక్షల మంది వరకు ఉంటారని అంచనా.


బకాయిలు విడుదల చేయాలి

సంవత్సరాల తరబడి భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన పెండింగ్ దరఖాస్తులు క్లెయిమ్‌లు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొల్లాడ నాగరాజు, పోలిరాతి ఆదినారాయణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డులో ఉన్న వెయ్యి కోట్లును కార్మికలకు అందించాలని కోరారు.

గత నాలుగేళ్లుగా పరిష్కారానికి నోచుకోని వివిధ క్లెయిమ్‌లు..

పథకం	2019	2020	2021	2022	మొత్తం
ప్రసూతి	389	309	550	260	1508
వివాహాలు	9	2	8	11	30
అంత్యక్రియలు	9	4	27	47	87
సహజ మరణం	7	2	14	22	45
యాక్సిడెంట్	0	0	1	1	2
ఆసుపత్రి	15	15	26	18	74
మొత్తం	425	332	626	359	1746

సహాయం అందలేదు




తణుకు పట్టణానికి చెందిన నరుకుల సతీష్ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం తణుకులోని ప్రభుత్వ కాలేజి వెనుక బిల్డింగ్ పనిచేస్తుండగా విద్యుత్ షాకు తగిలి కుడికాలు, కుడిచేయి తీసేశారు. ఎడమ కాలు వేళ్ళు తీసేశారు. సంక్షేమ బోర్డు నుంచి సహాయం కోసం దరఖాస్తు చేసినప్పటికి ఇప్పటికీ రాలేదు

ఆర్థికంగా చాలా ఇబ్బందులు



తణుకు పట్టణానికి చెందిన గుమ్మల రామ జోగేశ్వరరావు తొమ్మిది నెలల క్రితం బిల్డింగ్ మీద నుంచి పడి రెండు కాళ్ళు విరిగిపోయాయి. కార్మిక శాఖ నుంచి ఎలాంటి సాయం అందలేదు. ఆర్థికంగా తమ కుటుంబం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని ప్రభుత్వం సాయం అందించాలని కోరుతున్నాడు.

వివాహ కానుక ఏది



తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన రావులపూడి అప్పారావు తన కుమార్తె వివాహానికి కాను కకు సంబందించి అక్టోబరు 21, 2021 సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్నాడు సాయం అందలేదు. తర్వాత తమ కుమార్తె డెలివరీ సాయం కోసం 2023 ఏప్రిల్ 20న దరఖాస్తు చేశాడు. రెండింటిలో ఏ కానుకా రాలేదు.

వీడని తుఫాన్ కష్టాలు


చినపాలపర్రు వద్ద పొలాల నుంచి ఇంజన్‌తో నీటిని బయటకు తోడుతున్న దృశ్యం

ముదినేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ వాతావరణం ఇంకా వీడలేదు. వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గాలులు వీస్తూనే ఉండడంతో సార్వా వరి పంటకు భారీ నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ముదినేపల్లి ప్రాంతంలో బుధవారం కురిసిన భారీ వర్షం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఇప్పటికే నేలకొరిగిన వరి పైరుకు నష్టం కలిగే ప్రమాదం ఏర్పడింది. మండలంలో సుమారు ఐదువేల ఎకరాల్లో వరి పైరు నేలమట్టమయింది.ఇప్పటి వరకు ఆరబెట్టి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. తేమ శాతం 28 పైగా ఉండడంతో రూ.1.737కు అమ్మాల్సిన 75 కేజీల బస్తా ధాన్యం రూ.1500కు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి : వాతావరణం మార్పులతో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ అన్నారు. బుధవారం తాడినాడ, చిన తాడినాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి కోత యంత్రాలతో కోసిన ధాన్యాన్ని సురక్ష ప్రదేశాలకు తరలించాలన్నారు. మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్ మాట్లాడుతూ చేపల, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ లోపించకుండా నిరంతరాయంగా ఏరియేటర్లు తిరుగుతూ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

నూజివీడులో ఫ్లెక్సీ కలకలం



ఏబీ వెంకటేశ్వరరావుకు మద్దతుగా ప్రచారం

నూజివీడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిస్టర్ జగన్‌రెడ్డి బీ కేర్‌ఫుల్.. ఆర్థిక నేరస్థుడు స్థానం జైలు అంటూ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు ఫొటోతో ఏలూరు జిల్లా నూజివీడు పట్టణ కూడళ్లలో ఫ్లెక్సీలు వెలిశాయి. స్థానిక టీడీపీ నాయకుల ఫొటోలతో కట్టిన ఫ్లెక్సీ చర్చనీయాంశమైంది. ఇటీవల మాజీ సీఎం జగన్‌రెడ్డి ఏబీ వెంకటేశ్వరరావును ఏకవచనంతో సంబోధిస్తూ విమర్శించిన నేపథ్యంలో ఈ ఫ్లెక్సీలు నూజివీడు పట్టణంలో వెలిసినట్లు తెలుస్తోంది. ఏబీ వెంకటేశ్వరరావు నూజివీడు స్థానికుడు కావడంతో ఆయనతో సన్నిహితంగా ఉండే నాయకులు వీటిని ఏర్పాటు చేసినట్లు సమాచారం.


ఇళ్ల ఆవరణలో చెట్లను కొలతలు తీసుకుంటున్న అటవీశాఖ సిబ్బంది

ఆర్‌అండ్‌ఆర్ ఇళ్ల సర్వేలో చెట్ల కొలతల నమోదు

కుక్కునూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్‌లో పునరావాస ప్రక్రియ వేగం కానుంది. గతంలో సర్వే పూర్తయినప్పటికి పలు గ్రామాల్లో ఇళ్ల వివరాలు జాబితాలో గల్లంతయ్యాయి. తిరిగి తమ ఇళ్ల పేర్లను జాబితాలో నమోదు చేయాలని ముంపు గ్రామ ప్రజలు పదేపదే అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇదే సమయంలో ఇటీవల వేలేరుపాడు మండలానికి చెందిన జగన్నాథపురం నిర్వాసితులు కుక్కునూరు మండలానికి చెందిన కుక్కునూరు ఏ.బ్లాక్, చివ్వాక నిర్వాసితులు తమ ఆవేదనను అధికారుల ముందు ఉంచారు. ఇదే విషయం సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా వెళ్ళింది. ఈ క్రమంలో జాబితాలో తొలగించబడిన ఇళ్లకు సంబంధించి సర్వేను మళ్లీ చేపడుతున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అటవీశాఖ నుంచి ఒక ఉత్తర్వు జారీ అయ్యింది. కుక్కునూరు మండలం కుక్కునూరు ఎ బ్లాక్, చివ్వాక, రామచంద్రాపురం గ్రామాలతో పాటు వేలేరుపాడు మండలం చిగురుమామిడి, రేపాక గొమ్ము, జగన్నాథపురం, పూసుగొంది, తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం తదితర ముంపు గ్రామాల్లో నిర్వాసితుల ఇళ్ల ప్రాంగణంలో చెట్లను గుర్తించాలని సూచించారు. వాటి కొలతలు నమోదు చేసి వాటి విలువను అంచనా వేసి అనంతరం ఒక నివేదిక అధికారులకు పంపించాల్సి ఉంది. ఈ క్రమంలో బుధవారం కుక్కునూరు, చివ్వాక గ్రామాల్లో కుక్కునూరు అటవీ రేంజ్‌లో పని చేస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది సర్వే ప్రారంభించారు. జాబితాలో ఉన్న ఇళ్లకు వెళ్లి చెట్ల కొలతలను తీసుకుంటున్నారు. కుక్కునూరు ఎ బ్లాక్ 99 ఇళ్ల పేర్లు, చివ్వాకలో 106 పేర్లకు సంబంధించిన ఇళ్లలో సర్వే జరుగుతుంది. కుక్కునూరు డిప్యూటీ రేంజ్ అధికారి కేసరి సర్వేను పర్యవేక్షిస్తున్నారు


మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బడేటి

ఏలూరు టూటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజా వేదిక కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో పాటు ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొన్నారు. సమస్యలను విన్నవించుకోడానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారన్నారు. ప్రజా ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచిస్తామని ఎమ్మెల్యే చంటి వివరించారు. ముందుగా ఏలూరులోని బడేటి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెల్లంకొండ కిశోర్ దాకరపు రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌సీసీ కేడెట్స్ ఉద్దేశించి మాట్లాడుతున్న కల్నల్ నాయక్

ఎన్‌సీసీ కేడెట్స్ లీడర్ లక్షణాలు కలిగి ఉండాలి

నరసాపురం రూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఎన్‌సీసీ కేడేట్ క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని కాకినాడ గ్రూప్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కల్నల్ నాయక్ అన్నారు. మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల 7 ఆంధ్రా నేవిల్ యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపును బుధవారం ఆయన సందర్శించి కేడేట్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్‌సీసీ చేరడం వల్ల శరీర ధ్రుడత్వం పెరుగుతుందన్నారు. క్యాంపులకు వెళ్లడం వల్ల దేశంలోని భిన్న ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, భాషలపై అవగాహన కలుగుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ఉన్నత చదువుల్లో ఎన్‌సీసీ కేటేడ్స్‌లకు రిజర్వేషన్ ఉందన్నారు. కావున శిక్షణలో విద్యార్థులు క్రమశిక్షణ, ఏకగ్రతతో ఉండాలన్నారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ అనిల్ మెహ్రా, క్యాంపు యూనిట్ కమాండర్ వై.ప్రదీప్, డిప్యూటీ క్యాంపు కమాండర్ లెఫ్టినెంట్ సంజీత్‌రౌత్రే, రాము తదితరులు పాల్గొన్నారు.


పోలవరం ప్రాజెక్టు వద్ద ఏడేళ్ల క్రితం స్పిల్‌వే ప్రాంతం, ప్రాజెక్టు చెక్‌పోస్ట్ సమీపంలో భూమిలో కదలికలు ఏర్పడి రోడ్డు మార్గం బీటలు వారింది.

ఎప్పుడెప్పుడు భూకంపం వచ్చింది..

- 1969 ఏప్రిల్ 13న భద్రాచలం వద్ద గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఫాల్ట్‌లైన్ కారణంగా 5.7 తీవ్రతతో బలమైన భూకంపం సంభవించింది.
- 2021 జూలైలో చిత్తూరు జిల్లా ఈడిగపల్లి చిలకవారిపల్లి, షికారిపాళ్యం, కోటగడ్డలో 6 సెకన్లపాటు భూకంపం సంభవించి భూమి కదలడంతో పెద్ద శబ్దాలు రావడంతో ప్రజానీకం భయాందోళనలకు గురయ్యారు.
- 2022 అక్టోబరు 12న రాత్రి 11.12 గంటలకు అదిలాబాద్ జిల్లాలో ఉట్నూరు, వజీర్‌పురా, మోమిన్‌పురా, ఫకీర్ గుట్ట ప్రాంతాల్లో రెండు సెకన్లపాటు భూమి కంపించింది.
- 2022 జూలై 13న నెల్లూరు, కడప జిల్లాలలో మర్రిపాడు, మండలం బ్రాహ్మణపల్లి, చిలకపాడు, కృష్ణాపురం గ్రామాల్లో ఉదయం 5.20 గంటలకు 3 సెకన్లు భూకంపం సంభవించింది.
- 2024 మార్చి 14న తిరుపతిలో 13.84వ అక్షాంశం వద్ద 79.91 రేఖాంశం వద్ద భూకంప కేంద్రం ఉందని, అది రిక్టర్ స్కేలుపై 3.9 గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది.

- పోలవరం

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఫాల్ట్ లైన్

గోదావరి పరీవాహక ప్రాంతాలైన పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, భద్రాద్రి జిల్లా, ఏలూరు జిల్లా గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలలో సైతం నదీ తీరం వెంట ఫాల్ట్ లైన్ ఉంటుంది. ఆ ప్రాంతాల్లో భూప్రకంపనలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టే సమయంలో సీనియర్ విశ్రాంత సూపరింటెండెంట్ హెచ్చరించారు.

భూప్రకంపన

జిల్లాలో సెకన్లపాటు ప్రకంపనలు.. బెదిరిపోయిన జనం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గోదావరి పరీవాహక ప్రాంతంతోపాటు మిగతా ప్రాంతాల్లో బుధవారం భూమి స్వల్పంగా కంపించింది. ఉదయాన్నే ఎవరి పనిలో వారుండగా 7.45 గంటల సమయంలో ఐదు నుంచి పది సెకన్లపాటు భూమి స్వల్పంగా కంపించింది. భద్రాచలంకు సమీపాన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 15 సెకన్లకుపైగా రెండు విడతలుగా భూప్రకంపనలు రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. వంట గదుల్లో వస్తువులు కిందపడ్డాయి. కొందరు ఇళ్ల నుంచి బయటకు పరుగులుతీశారు. భూకంపం వచ్చిందంటూ పెద్ద ఎత్తున కేకలు వేశారు. చాలా మంది కాసేపు ఆందోళన చెందారు. కుక్కునూరు శివాలయంలోని ధ్వజస్తంభానికి ఉన్న గంటలు భూప్రకంపనల కారణంగా ఒక్కసారిగా మోగినట్లు భక్తులు చెబు తున్నారు. ప్రకంపనలు వచ్చే పావుగంట ముందు గ్రామంలో కోతులు ఆందోళనగా అటుఇటూ ఉరు కులు పెట్టినట్లు గమనించామని కొందరు చెబు తున్నారు. జీలుగుమిల్లి, టి.నర్సాపురం, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూ డెం, పోలవరం, బుట్టాయిగూడెం ప్రాంతాల్లో కొన్ని సెకన్లపాటు భూమి కంపించింది. వాస్తవా నికి పోలవరం ప్రాంతం భూకంపాలకు ఆస్కారం లేదు. కాని ఇక్కడ కూడా తొలిసారిగా బుధవారం సెకన్లపాటు స్వల్ప భూప్రకంపనలు కనిపించాయి. దీంతో ఆందోళన వ్యక్తమవుతుంది. గోదావరి పరివాహక ప్రాంతంలో ఈమధ్య కాలంలో తొలిసారిగా ఇప్పుడు ప్రకంపనలు నమోదు కావడంపై అధికారులు సైతం నివ్వెరపోతున్నారు. ద్వారకాతిరుమల, ఏలూరు వంటి ప్రాంతాల్లో సెకన్లపాటు భూప్రకంపనలు వెలువడగా స్థానికులు తొలుత దీనిని తేలిగ్గా తీసుకున్నారు. రెండోమారు ప్రకంపనలు రావడంతో భూకంపంగా నిర్ధారించి ఆందోళన చెందారు. 'ఉదయాన్నే అందరం కూ ర్చొని ఉండగా 7.45 గంటల ప్రాంతంలో ప్రకంప నలు వచ్చాయి. ఇదేంటి ఏదో అదురుతుందని ముందుగా అనుకున్నాం. ఆ తరువాత కొద్ది సేప టికే మా ఎదుటే ఉన్న టీపాయి, ఖాళీ కుర్చీలు సైతం కదలడం కనిపించింది. ఇదంతా కొన్ని సెకన్లపాటే ఉంది' అని ఆర్‌ఆర్ పేటకు చెందిన ఒక ఆసుపత్రిలో జనరల్ మేనేజర్ శివప్రసాద్ వెల్లడించారు. నగరంలో ఒకట్రెండు చోట్ల కూడా మాత్రమే కొందరికి ఈ అనుభవం ఎదురైంది. కొయ్యలగూడెం పట్టణంలోని అశోక్‌నగర్, కన్నాపురం, అంకాలగూడెం, దిప్పకాయలపాడు గ్రామాల్లో ప్రకంపనులు గమనించారు. గెడా సత్తిబాబు ఇంటి వద్ద తలుపులు కొట్టుకో వడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. కొయ్యలగూడెం పట్టణంలోని మండల పరిషత్ ఉద్యోగి స్వామి ఇంటి వద్ద పెంపుడు కుక్కలు యాజమానుల వద్దకు వచ్చి అరిచినట్లు ఆయన తెలిపాడు. కామవరపుకోట మండలంలో పలు గ్రామాల్లో నివాసాలు, వీధుల్లోని వస్తువులు కదలికలు ఏర్పడడంతో కొందరు వీధుల్లోకి పరుగులు తీశారు. కొన్ని సెకన్ల అనంతరం ప్రకంపనలు ఆగిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం సుబ్బారెడ్డి కాలనీలో కొప్పాక శ్రీనివాసరావు కూర్చున్న కుర్చీతో పాటు గ్యాస్ బండ, సోఫా ఒకేసారి కదలడంతో ఇంట్లో వారు బయటకు పరుగులు తీశారు. నూజివీడు రూరల్ మండలం మీర్జాపురం, మండల కేంద్రమైన ఆగిరిపల్లి, చాట్రాయిలలో కూడా భూమిలో స్వల్ప ప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు నిర్ధారించారు. సాధారణంగా ఈ ప్రాంతాల్లో భూప్రకంపనలకు పెద్దగా ఆస్కారంలేదని, అయినప్పటికి ఇప్పుడు తొలిసారిగా స్వల్ప స్థాయిలో ప్రకంపనలు ఏర్పడడంతో ఆందోళన కలిగిస్తుందని స్థానికులు పేర్కొంటుండగా పెద్దగా భయపడాల్సిన అవసరంలేదంటూ అధికారులు చెబుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొద్ది సెకన్ల పాటు భూప్రకంపనలతో పలువురు భయపడ్డారు. రెండు, మూడు సెకన్లు ప్రకంపనలు గమనించినట్లు పలువురు చెప్పారు.

భూకంపాలు ఎందుకు సంభవిస్తాయంటే..

పర్యావరణానికి విఘాతం, భూగర్భ జలాల దుర్వినియోగం, అడవుల్లో చెట్లు నరికివేత, విస్ఫోటక రసాయనాల వాడకం తదితర కారణాలతో భూకంపం సంభవిస్తుంది. భూమి అట్టడుగు పొరలలో అకస్మాత్తుగా విడుదలయ్యే శక్తి వలన పుట్టే ప్రకంపనమే భూకంపం. ఇవి ప్రకృతి మార్పులు, మానవ ప్రేరేపిత చర్యలతో కూడా సంభవిస్తాయి. నీటి ఒత్తిడి భూమిపై పడి భూప్రకంపనలకు అవకాశాలున్నాయి. భూమి పరిభ్రమణంతో అంతర్గత పొరల్లో సర్దుబాట్ల వల్ల కూడా ప్రకంపనలు సంభవిస్తాయి. రిక్టర్ స్కేల్‌పై భూకంపం 3 కంటే తక్కువ ఉన్నపుడు తీవ్రత కనిపించదు. రిక్టర్ స్కేల్‌పై 7 చూపితే భారీ ప్రమాదాలు సంభవిస్తాయి. కొన్ని సందర్భాలలో భూమి విచ్ఛిన్నం అవుతుంది. భూకంప కేంద్రం సముద్రంలో ఉంటే సునామీ వంటి ఉపద్రవాలు ఏర్పడతాయి.


కొయ్యలగూడెంలోని ఒక ఇంట్లో చెల్లాచెదురైన వస్తువులు


ఇరగవరంలో పట్టుబడిన మద్యం

ఉమ్మడి గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం పోలింగ్ జరగనుంది. మంగళవారం సాయంత్రం నుంచి మద్యం దుకాణాలను మూసి వేయించారు. అయినప్పటికీ ఉమ్మడి జిల్లాలో బుధవారం జోరుగా మద్యం విక్రయాలు సాగాయి. పలుచోట్ల ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని పలువురిని అదుపు లోకి తీసుకున్నారు. పలుచోట్ల బెల్ట్ షాపు నిర్వాహకులను అరెస్ట్ చేశారు.

కోడ్.. లెక్కలేదు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ మద్యం దుకాణాలు మూత
- ఉమ్మడి జిల్లాలో అక్రమ విక్రయాల జోరు
- ఎక్సైజ్ అధికారుల దాడులు


పెంటపాడు మండలం పరిమెళ్ల, తాడేపల్లిగూడెం పట్టణంలో స్వాధీనం చేసుకున్న మద్యం

భీమవరం క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భీమవరం ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు తెలిపారు. వనిమ కృష్ణమూర్తిని అరెస్ట్ చేసి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడులలో పిఎస్ డి భోగేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భీమవరం మండలం తాడేరులో పాలపర్తి జాన్ రత్నకుమార్ వద్ద 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

- పాలకొల్లు రూరల్: పట్టణానికి చెందిన పి శ్రీనివాసు వద్ద 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు సీఐ ఎం శ్రీనివాసరావు తెలిపారు.
- ఇరగవరం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్ మణికంఠరెడ్డి తెలిపారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన గరగ శ్రీను వద్ద నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వివిధ మద్యం షాపుల నుంచి కొనుగోలు చేసిన అధిక ధరలకు విక్రయించే క్రమంలో అధికారులు అరెస్టు చేశారు.
- తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని యాగర్లపల్లిలో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు పట్టణ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఇ.స్వరలక్ష్మి తెలిపారు. ఇతని వద్ద నుండి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఐ మురళిమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.
- పెంటపాడు: మండలంలోని పరిమెళ్ళ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి 48 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఆర్.భోగేశ్వరరావు తెలిపారు. నిందితుడిని తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించామన్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలో అక్రమంగా మద్య విక్రయిస్తున్న గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన మేడిచర్ల మోహన్ నుంచి 46 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై బాదం శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.
- కుక్కునూరు: మండల పరిధిలోని కొండపల్లిలో ఎక్సైజ్ శాఖ జరిపిన దాడిలో 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్సు ఎస్సై ఎండీ అరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.
- చింతలపూడి: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో తడికలపూడి గ్రామానికి చెందిన మొటపర్తి వీరభద్ర మద్యం బెల్టు షాపు నిర్వహిస్తుండడంతో కామవరపుకోట తహసీల్దార్ ముందు హాజరుపరిచారు. మొదటి విడత బైండోవర్‌ను అతిక్రమించినంద రూ.20 వేల జరిమానా విధించారని సీఐ పి.అశోక్ తెలిపారు. అతడి వద్ద మరో 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని బైండోవర్ చేశామన్నారు. కామవరపుకోటకు చెందిన వీరంశెట్టి సురేష్‌కుమార్ నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని బైండోవర్ నమోదు చేసినట్లు తెలిపారు.
- జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ పోలీసులు బుధవారం పలుచోట్ల దాడులు నిర్వహించారు. జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురంలో గుమ్ములూరి ముసలయ్య వద్ద 39 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ శ్రీనుబాబు తెలిపారు. లక్కవరంలో పులపాకుల సత్యనారాయణ వద్ద 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కుకునూరు మండలం కొండపల్లిలో లోతోట వెంకటేశ్వరరావు వద్ద 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.
- ఏలూరు క్రైం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న తరుణంలో ఒక వ్యక్తి దగ్గర మద్యం బాటిల్స్ ఉన్నట్లు ఏలూరు త్రి టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావుకు సమాచారం అందడంతో తన సిబ్బందితో బుధవారం రాత్రి దాడి చేశారు. ఏలూరు రామకృష్ణాపురం భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఏలూరు రూరల్ మండలం చాటపర్రునకు చెందిన అరిగల విజయ్‌రమేష్ 30 మద్యం బాటిల్స్‌ను కల్గి ఉన్నాడు. దీంతో అతనిని అరెస్టు చేసి అతని నుంచి బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.


భీమవరం మండలంలో నిందితుడు

గ్యాస్‌బండ పేలి ఇల్లు దగ్ధం

పెదవేగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వంట చేస్తుండగా గ్యాస్‌బండ పేలిన ఘటనలో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గార్లమడుగు గ్రామానికి చెందిన పోతురాజు నాగరాజు భార్య సుబ్బమ్మ మంగళవారం రాత్రి వంట చేస్తుండగా గ్యాస్ బండ దగ్గర మంటలు వ్యాపించాయి. దీంతో సుబ్బమ్మ ఇంటినుంచి బయటకు పరుగు తీసింది. వెంటనే గ్యాస్ బండ ఒక్కసారిగా పేలి, మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో బాధితులు క్షేమంగా భయటపడగా తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. వస్తువులు కాలిబూడిదయ్యాయి. దీనిపై గ్రామ వీఆర్వో వీర్రాజు తహసీల్దారు భ్రమరాంబకు ఫిర్యాదు చేశారు.


ఆవుదూడకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

ఆవు దూడను ఢీకొన్న వాహనం

రక్షించిన గోసంరక్షణ సమితి

భీమవరంటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ గుడి వద్ద ఒక ఆవు దూడను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. రెండు మూడు రోజుల క్రితం జరిగిన సంఘటనను స్థానికులు ఎవరూ పట్టించుకోలేదు. ఆవు దూడ కాలికి తీవ్ర గాయాలు కావడంతో వాచిపోయి కదలలేని స్థితిలో ఉంది. దూడను గమనించిన గోసంరక్షణ అధ్యక్షుడు సుంకర దాసు తక్షణం స్పందించారు. బుధవారం డాక్టర్ సాయి సహకారంతో దూడకు వైద్యం అందించారు. ప్రస్తుతం దూడ కోలుకుంటోందని చెప్పారు. పశువులను రోడ్లపై వదలవద్దని సూచించారు. వాహనాలు ఢీకొని మూగజీవాలు నరకం చూస్తున్నాయని, సంబంధిత అధికారులు పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తక్కువ ధరకు బంగారం ఇస్తానంటూ రూ.36 లక్షలు కొట్టేశాడు

పోలవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని నమ్మబలికి సుమారు రూ.36 లక్షలు కొట్టేశాడు. ఈ కేసులో ప్రథమ ముద్దాయిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పోలవరం మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన కోటిపల్లి రమేశ్ దంపతులు తక్కువ ధరకు బంగారం వస్తుందని మోసపోయారు. బాపట్ల జిల్లా అద్దంకి గ్రామానికి చెందిన బక్కా అబ్రహంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిని అరెస్టు చేసి ఒక కారుని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడిని జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరు పరచగా ఈనెల 18 వరకూ ఏలూరు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇలాంటి నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పుడు మాటలు విని మోసపోవద్దని హెచ్చరించారు.

గురుకులంలో సీటు ఇప్పిస్తానని డబ్బు వసూలు

బాధిత మహిళ ఫిర్యాదు

ద్వారకాతిరుమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గురుకులంలో సీటు కోసం డబ్బులు ఇచ్చి మరో మహిళ మోసపోయింది. మోసగించిన టీడీపీ నేతపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిమ్మాపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత కొత్తపల్లి సుబ్బారావు తన కుమారుడికి పెదవేగి గురుకులంలో 7వ తరగతిలో సీటు ఇప్పిస్తానని నమ్మబలికాడన్నారు. ఏడాది క్రితం రూ. 20 వేలు తీసుకుని మోసం చేశాడని అదే గ్రామానికి చెందిన నంబూరి నాగ తులసి పోలీస్‌స్టేషన్ వద్ద విలేకర్లకు తెలిపింది. ఇంత వరకూ తన బిడ్డకు గురుకులంలో సీటూ ఇప్పించలేదని, తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వలేదంటూ ఆమె వాపోయింది. ఏడాది కాలంగా డబ్బులకోసం తిరుగుతున్నా పట్టించుకోవడం లేదంటూ ఆమె ఆవేదన చెందింది. ఇదిలా ఉంటే బాధిత మహిళతో సుబ్బారావు రాజీ కుదుర్చుకున్నట్లు పలువురు చెబుతున్నారు.

జ్వరాలపై అవగాహన కల్పించండి

ఏలూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డెంగీ, మలేరియా, ఇతర జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ షర్మిష్ట సూచించారు. ఏలూరు జిల్లా కార్యాలయంలో డెంగీ, మలేరియా కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ప్రజలకు కరపత్రాల ద్వారా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా, దోమల ద్వారా వచ్చే వ్యాధులపె అవగాహన కల్పించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, ఐడీఎస్పీ జిల్లా అధికారి డాక్టర్ చక్రధర్‌రావు, వైద్య అధికారి శశాంక్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య వర్ధంతి

చింతలపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య తృతీయ వర్ధంతి జరిగింది. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రోశయ్య చిత్రపటానికి పట్టణ శాఖ అధ్యక్షులు వి.శేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ సి.ధర్మరాజు, కె.ప్రసాద్, అబ్బయ్య, కె.వాసు, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రజల సమస్యలు పరిష్కరించాలని కొల్లేరు సంఘం సీనియర్ నాయకులు ఎస్.గోవర్ధన్ విజ్ఞప్తి చేశారు. కొల్లేరు ప్రజలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప వారికి జీవనోపాధి చూపించిన దాఖలాల్లేవన్నారు. కొల్లేరుకు జీవనాడి ఉప్పుటేరు రెగ్యులేటర్‌ను కూటమి ప్రభుత్వమే నిర్మిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు .రెగ్యులేటర్ నిర్మాణ దిశగా అడుగులు వేయాలని కోరారు. జీవనోపాధి కోసం వలసలు వెళుతున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నేతృత్వంలో కొల్లేరు ప్రజలకు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆ నిర్ణయాలు రద్దు చేయాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బుధవారం డీఈవోని కలిసి వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఅలీ, రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సెలవు పెట్టరాదనే ఆంక్షలు విధించటం సరికాదన్నారు. దీంతో ఎంఈవోలు అత్యవసర సెలవులు కూడా ఇవ్వడం లేదన్నారు. విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలని విద్యా శాఖ అధికారులకు బుధవారం నోటీసులు ఇవ్వడం, 11న డీఈవో కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన, 16న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రిస్టియన్‌లకు న్యాయం చేసేది కూటమి ప్రభుత్వమే

జంగారెడ్డిగూడెం,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు క్రిస్టియన్ మైనారిటీలకు న్యాయం చేస్తారని టీడీపీ రాష్ట్ర క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడు ఇ.స్వామి అన్నారు. పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో క్రిష్టియన్లకు న్యాయం జరగలేదన్నారు. చంద్రబాబు క్రిష్టియన్ భవన్‌కు రూ.పది కోట్లు మంజూరు చేశారన్నారు. క్రైస్తవుల సమాధులకు స్థలాలివ్వాలని అధికారు లకు ఆదేశించారన్నారు. మండల పాస్టర్ల సంఘ అధ్యక్షుడు సిహెచ్.స్టీఫెన్, మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుష్ప-2.. విడుదల థియేటర్ పరిశీలించిన డీఎస్పీ



పోలవరం డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో పుష్ప-2 సినిమా రిలీజ్ సందర్భంగా బెనిఫిట్ షో నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. థియేటర్ యాజమాన్యంతో మాట్లాడి షో వివరాలు తెలుసుకున్నారు, థియేటర్‌లో సీటింగ్, మౌలిక వసతులు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు. స్థానిక గంగాభవాని థియేటర్ వద్ద భారీ ఫ్లెక్సీలు కట్టి అల్లు అర్జున్ అభిమానులు తమ అభిమానాన్ని చాటుకున్నారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

పెదవేగి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : భీమడోలు- పెదవేగి 232కేవీ విద్యుత్ కండక్టర్ మార్పు చేస్తున్న సందర్భంగా ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మూడు రోజులపాటు విద్యుత్ సరఫరాలో మార్పులు ఉంటాయని ట్రాన్స్‌కో ఏలూరు ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాను రెండు విడతలుగా సరఫరా చేస్తామన్నారు.

పొట్టేలు సుబ్బారావు మృతి కళారంగానికి తీరనిలోటు

టి.నరసాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెంకి చెందిన సీనియర్ బుర్రకథ కలాకారుడు పొట్టేలు సుబ్బారావు మృతి కళారంగానికి తీరనిలోటని ఏపీ జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన సుబ్బారావు మృతికి ఏపీ ప్రజా నాట్య మండలి సీనియర్ బుర్రకథ కళాకారుడు ఎస్.కనకారావు, ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్‌కమిటీ కన్వీనర్ సీనియర్ బుర్రకథ కళాకారుడు టీఎస్ రాజు, ప్రముఖ బుర్రకథ కళాకారుడు వి.సత్యనారాయణ, బి.నందకు మార్ సంతాపం తెలిపారు. సీనియర్ బుర్రకథ కళాకారుడు బొర్రంపాలెంకు చెందిన మామిళ్ళపల్లి సుబ్బారావు గారి శిష్య బృందంలో ఒకడైన సుబ్బారావు గత ఏడాదికాలంగా అనారోగ్యంతో మృతిచెందారన్నారు.

ఈనీరే తాగునీరు

» కాల్వ నిండా గుర్రపు డెక్క చెత్తా చెదారం » నాలుగేళ్లుగా అదేతీరు

నగర ప్రజలకు తాగునీరు అందిస్తున్న కృష్ణా కాలువ గుర్రపు డెక్క చెత్తా చెదారంతో డంపింగ్ యార్డులా మారిపోయింది. ఈ కాల్వలో మురుగునీరు కలుస్తుండడంతో దోమలు, పందులతో దుర్గంధభరితంగా ఉంది. ఇటుగా రాకపోకలు సాగించే వారు ముక్కు మూసుకోవాల్సిందే. కాలువకు ఇరువైపుల తుప్పలు, భారీ వృక్షాలతో అదో అడవిలో పారే కాలువను తలపిస్తుంది. ఈ నీరుతాగే ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారన్న ఆలోచన కూడా పాలకులకు, అధికారులకు లేకుండా పోయింది.

ఏలూరు రూరల్/ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గడిచిన ఐదేళ్లలో కాల్వల్లో పూడిక తీసిన పాపాన పోలేదు. గుర్రపుడెక్క, పేరుకున్న చెత్తాచెదారం, నెర్రలిచ్చిన కాల్వ గట్లు ఇలా.. కృష్ణాకాల్వ అధ్వానంగా మారింది. సాగునీటితో పాటు వేల ఎకరాలకు సాగుకు ఆధారమైన కృష్ణాకాల్వ వట్లూరు నుంచి తూర్పులాకుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు, పాలిథిన్ సంచులు.. ఇలా ఒకటేంటి ఇదో డంపింగ్ యార్డులా తయారైంది. కనుచూపుమేరలో గుర్రపుడెక్క పేరుకుపోయింది. పోనీ కాల్వగట్లు అయినా చక్కగా ఉన్నాయా అంటే అదీ లేదు. ఏపుగా పెరిగిన ముళ్లచెట్లతో గట్టంతా నిండిపోయింది. ఏలూరు నగర పరిధిలో సుమారు 3కిలో మీటర్ల మేర కాల్వంతా కాలుష్య కాసారంగా మారింది. వర్షాకాలంలో ఇరిగేషన్ అధికారులు అక్కడక్కడ గుర్రపుడెక్క మందు పిచికారీ చేసి మమ అన్పిస్తున్నారు. ఈ కాల్వలో ఏకంగా మురుగునీరు కలుస్తున్నా ఈ నీటినే శుద్ధిచేసి సుమారు 3 లక్షలకు పైగా ఉన్న జనాభాకు మంచినీరుగా సరఫరా చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు కాల్వ పక్క నుంచే రాకపోకలు సాగిస్తున్నా కాల్వ ప్రక్షాళనపై దృష్టి సారించడం లేదని నగరవాసులు మండిపడుతున్నారు. మరోవైపు గడిచిన ఐదేళ్ల వైసీపీ హయంలో సొంత నిధులతో పంట కాల్వలను బాగు చేసుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గొల్లాయిగూడెం వద్ద కృష్ణ కాలువలో చెత్త గుర్రపు డెక్క,(ఇన్‌సెట్‌లో) లాకుల వద్ద పేరుకుపోయిన చెత్త

మంత్రి లోకేశ్‌ను కలసిన పాకలపాటి



ద్వారకాతిరుమల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, పాకలపాటి గాంధి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి చేసిన సేవలను, తాను నిర్వహించిన పదవులను వివరించారు. తనకు ఏదైనా నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరారు. పార్టీకి చేసిన సేవలకు తగిన గుర్తింపునిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారని విలేకర్లకు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ది ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం బుధవారం స్థానికంగా జరిగింది. అసోసియేషన్ సభ్యులంతా ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.శేఖర్, ఉపాధ్యక్షులుగా ఎం.దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎన్ డీ ప్రసాద్, కోశాధికారిగా ఎం.కృష్ణకిశోర్, గౌరవాధ్యక్షుడిగా యు.ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫొటో గ్రాఫర్, మాజీ మున్సిపల్ చైర్మన్ యు.జగదీష్‌బాబు హాజరయ్యారు.

ప్రశాంతంగా నేషనల్ సర్వే పరీక్షలు

భీమడోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎచీవ్‌మెంట్ పరీక్షలు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నా నేషనల్ సర్వే పరీక్షలు పలు పాఠశాలలో జరిగాయి. 3,6,9 తరగతి విద్యార్థుల్లో గణితం, సైన్స్, సోషల్ సామర్థ్యాల సాధనను పరీక్షించేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తారని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. భీమడోలు జిల్లా పరిషత్ పాలేటి ఆదిత్య హైస్కూలు, జిల్లా పరిషత్ పూళ్ళ, ఎంఎంపురం, అన్నేవారిగూడెం, గుండుగొలను హైస్కూలు నుంచి మొత్తం 144 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పలు పాఠశాలల్లోని పరీక్షలను ఎంఈవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ఈ పరీక్షలను కరక్ రాష్ట్రీయ పర్యవేక్షణ్ పేరుతో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

హెల్మెట్ ధరించాలి

ఏలూరు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహదారులు హెల్మెట్ ధరించాలని, ఏలూరు టూ టౌన్ మహిళా ఎస్ఐ నాగకల్యాణి అన్నారు. ఎస్ఐ నాగకల్యాణి ఏలూరు ఓవర్ బ్రిడ్జి క్రింద తాపీ కార్మికులకు బుధవారం ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు దెబ్బ తగిలి ఎక్కువ మంది మరణిస్తున్నారన్నారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్ ధరించాలని జిల్లా రవాణా శాఖ కమిష నర్ షేక్‌కరీమ్ ప్రజలకు సూచించారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారులు ఆకస్మికంగా వాహనాల తనిఖీలు చేసి హెల్మెట్ లేని వారికి అవగాహన కల్పించారు. షేక్ కరీమ్ మాట్లాడుతూ హెల్మెట్ లేకపోతే రూ.వెయ్యి జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్సును మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తామన్నారు. నవంబర్‌లో హెల్మెట్ లేని వారిపై 943 కేసులు నమోదు చేశామన్నారు.

రైతులకు అన్యాయం చేయొద్దు

పెదవేగి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తేమ శాతం పేరుతో రైతుల ఆరుగాలం కాయ కష్టం బూడిదలో పోసిన పన్నీరే అవుతోందని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదనగా అన్నారు. పెదవేగి మండలం వంగూరు, లక్ష్మీపురం గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. పలువురు రైతులు తేమశాతం ఎక్కువగా ఉందని చెప్తూ మిల్లర్లు ధాన్యంలో తగ్గింపు చేస్తున్నారని చెప్పారు. అంతేకాక తేమశాతం రైతు భరోసా కేంద్రానికి, మిల్లులకు మధ్య రెండు శాతం వరకు తేడా ఉంటుందని రైతులు వివరించారు. దీనిపై స్పందించిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్బీకేలకు, మిల్లర్లకు మధ్య తేమశాతంలో వ్యత్యాసంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. వంగూరుకు చెందిన జోజి అనే కౌలురైతు ఆర్బీకేలో 17.2 తేమ శాతం చూపించగా, రైస్ మిల్లులో 20 శాతం చూపిస్తున్నారని ఆ రైతు తెలిపారు. మరో రైతుకు చెందిన ధాన్యం ఆర్బీకేలో 15.5 శాతంరాగా, రైస్‌మిల్లులో 21 శాతం చూపించారని, ఆర్బీకేలకు, రైస్ మిల్లుల కు మధ్య ఈ వ్యత్యాసం ఎందుకు వస్తుందని శ్రీనివాస్ ప్రశ్నించారు. ఇలాంటి కారణాలతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారని, దీనిపై పౌరసరఫరాల శాఖ చర్యలు తీసు కోవాని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. రైతులు జోజి, అబ్రహం, సీతారామయ్య, నాగేశ్వరరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

కుమార్తె కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు

లింగపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి ఫిర్యాదు చేసిన ఘటన లింగపాలెం మండలంలో చోటు చేసుకుంది. ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలంలో ఒక గ్రామానికి చెందిన ఓ యువతి (18) తల్లిదండ్రులు ఏలూరులోని ఆస్పత్రికి వెళ్లి వచ్చేసరికి కనిపించక పోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాపర్ వైర్లు చోరీ

లింగపాలెం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): సీడ్స్ కంపెనీకి చెందిన విద్యుత్ కాపర్ వైర్లు దొంగలు ఎత్తుకు వెళ్లిన ఘటన లింగపాలెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగాపురంలో గల పార్వతీ సీడ్స్(జి పార్వతీ జీఎస్ సీడ్స్) కంపెనీలో గత నవంబరు నెల 19వ తేదీ రాత్రి సమయంలో తాళాలు పగలకొట్టి విద్యుత్ మోటార్లు, వాటిలోని కాపర్ వైర్, కరంటు వైర్లను ఎత్తుకెళ్లినట్లు కంపెనీ యజమానులు జీఏ నగేష్‌కుమార్, పార్వతీ ఫిర్యాదు చేసినట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మదుర గాయకుడు ఘంటసాల



ఘంటసాల గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

ఏలూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలుగునేల ఉన్నంతవరకు ఘంటసాల పాట నిలిచి ఉంటుందని, బీవీ ఆర్ కళాక్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు బి.రామారావు అన్నారు. ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో బుధవారం రాత్రి ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో ఘంటసాల 102వ జయంతి సందర్భంగా గాయనీమణి రేవతి రామ్‌కుమార్ సారథ్యంలో ఘంటసాల సంగీత గానామృతలహరి అలరించింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఘంటసాల ఎంతో గొప్పకీర్తిని తన పాటలతో సంపాదించుకున్నారన్నారు. భక్తిగీతాలు పాడటంలో ఆయనను మించిన వారు లేరని కొనియాడారు. అనంతరం వి.మనస్విని, వై.అర్జున్ రావు, రాజేష్ మీనన్, నరేష్, సిహెచ్ కల్యాణ్ తదితర గాయనీగాయకులు ఘంటసాల గీతాల ను ఆలపించి అలరించారు. ఎమ్డీ ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల విగ్రహం ఏర్పాటు చేస్తాం

చింతలపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహాన్ని చింతలపూడిలో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేపట్టినట్టు ఘంటసాల అభిమాన సంఘం అధ్యక్షుడు వి.పూర్ణచంద్రరావు తెలిపారు. ఘంటసాల జయంతి సందర్భంగా పాతబస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పి.సర్వేశ్వరరావు, ఆచారి, సూర్య కుమార్, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్టిసీమలో నూతన పశు వైద్యశాల నిర్మిస్తాం

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం కొత్తపట్టిసీమలో పశు వైద్యశాల భవనాన్ని నిర్మిస్తామని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. పశుసంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెంనాయుడును వెలగపూడి సచివాలయంలో బుధవారం కలిసి మహేష్ వినతిపత్రం అందజేశారు. అనంతరం మహేష్‌కుమార్ మాట్లాడుతూ కొత్తపట్టిసీమలో 1977లో నిర్మించిన పశు వైద్యశాల శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మించాలని మంత్రి అచ్చెంనాయుడ్ని కోరానన్నారు. సానుకూలంగా మంత్రి అచ్చెం నాయుడు వెంటనే పశువైద్యశాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు.

136 వందే భారత్ రైళ్లు

దేశవ్యాప్తంగా 136 వందే భారత్ రైళ్ల సేవలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో బుధవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. మహేష్ వందేభారత్ రైళ్ల సేవలపై ప్రశ్నలడిగారు. దేశంలో 100 వందేభారత్ రైళ్ల టెండర్ల రద్దుకు కారణం ఏమిటని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా మంత్రి వైష్ణవ్ బదులిస్తూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలనే ఉద్దేశంతో భారతీయ రైల్వే సెమి హైస్పీడ్ వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టిందన్నారు. త్వరలోనే వందేభారత్ స్లీపర్ రైళ్లను కూడా ప్రవేశ పెడుతున్నామన్నారు. ప్రస్తుత పది వందే భారత్ స్లీపర్ రైళ్లు తయారీలో ఉన్నాయన్నారు.



మంత్రి అచ్చెం నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ మహేష్‌కుమార్

ఎంపీని కలిసిన సక్కుకుమారి

దెందులూరు : చల్లచింతలపూడికి చెందిన ముమ్మడి సక్కుకుమారిని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యురాలిగా ఎంపిక చేయించిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్‌కు, సక్కుకు మారి ఆమె భర్త, చింతయ్య దంపతులు బోకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

బుట్టాయగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటును వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ బుధవారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, గిరిజనులు ధర్నా చేశారు. బస్టాండ్ సెంటరులో ధర్నా చేసి ప్రదర్శన నిర్వహించారు. టి.బాబురావు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కమిటీ సభ్యుడు డి.సురేష్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఉద్యమాన్ని గుణపాఠంగా తీసుకోకుండా మరోకసారి భారీస్థాయిలో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై పెనుభారాన్ని కూటమి ప్రభుత్వం మోపిందని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచమని కూటమి ప్రభుత్వం ప్రచారం చేసిందని ఇప్పుడు ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో యూనిట్‌కు 92 పైసలు పెంచడం దుర్మార్గమన్నారు. విద్యుత్ చార్జీల వ్యతిరేకతపై ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. నాయకులు కె.రాఘవ, కేవీ రమణ, ఎస్.రామ్మోహన్, ఇ.భూషణం, కె.రామ లక్ష్మీ, బి.వినోద్, కె.పోతురెడ్డి, వి.వెంకటేశ్వరావు, జి.గంగిరెడ్డి గిరిజనులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు, గిరిజనులు

అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు శిక్షణ

ఏలూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని ఐటీఐ కళాశాలలో అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్ కోర్సుకు స్వల్పకాలిక శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ శాఖ అధికారిణి రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు కొన్ని పరిశ్రమల యాజమాన్యాలతో ఐటీఐ కళాశాల ఒప్పందం చేసుకుందన్నారు. 35 ఏళ్లలోపు వయస్సుండి 10వ తరగతి, ఆపై చదువుకుని ఖాళీగా ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, 10వ తరగతి సర్టిఫికెట్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 8978524022 నెంబర్లో సంప్రదించాలన్నారు.

హిందువులపై దాడులు అమానుషం

ఏలూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువుల పై జరుగుతున్న దాడులను యావత్ సమాజం ఖండించాలని వారికి అండగా నిలవాలని హిందు జాగ్రత ప్రతినిధి రమణమూర్తి కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, స్వామీజీల అక్రమ అరెస్టులను నిరసిస్తూ బుధవారం ఏలూరులో హిందువులు, సమితి ప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండు సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పెద్దఎత్తున వచ్చిన వ్యాపారులు, హిందుసంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు, స్వామిజీలు ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు చేరుకుని మానవ హారం నిర్వహించారు. కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. డీఆర్వోని కలిసి వినతిపత్రం అందచేశారు. రమణమూర్తి మాట్లాడుతూ బంగ్లాదేశ్ ప్రభుత్వం అక్రమ కేసు పెట్టి అరెస్టుచేసినా ఇస్కాన్ స్వామి చిన్మయ్‌కృష్ణదాస్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లోని మైనార్టీలకు యావత్ భారతదేశం అండగా నిలుస్తుందన్నారు. అర్చక సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఆత్రేయబాబు మాట్లాడారు. బీజేపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామచౌదరి, ఆర్టీసీ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ప్రముఖ వ్యాపారవేత్త లులానీ, కృష్ణనందగిరిస్వామి, కరుణానంద గిరిస్వామి, బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలాకిషోర్, ఘంటసాల వెంకటలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిశోర్, హిందు సంఘాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఫైర్ స్టేషన్ సర్కిల్‌కి చేరిన ర్యాలీ

ఘనంగా యునైటెడ్ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏలూరు సిటీ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెయింట్ జేవియర్ హైస్కూల్ ఆవరణలో యునైటెడ్ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు వైభ వంగా జరిగాయి. ఏలూరు నగరంలో అన్ని క్రైస్తవ సంఘాలు కలిసి గ్రాండ్ క్రిస్మస్ వేడు కలు నిర్వహించారు. ఈ వేడుకల్లో చెన్నై నుంచి కల్వరి దర్శనం దైవసేవకులు రెవరెండ్ డాక్టర్ ఎన్.జయ్‌పాల్ దైవసందేశం అందించారు. ఆర్‌సీఎం బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ జయ రావు పొలిమేర ఐసీఎం బిషప్ మోస్ట్ రెవరెండ్ బిషప్ జాన్ ఎస్‌డీరాజు మన్నా చర్చ్ బిషప్ మోస్టరె వరెండ్ ఎలిషారాజు ముఖ్య అతిథులుగా పాల్గొ న్నారు. ఏలూరు సిటీ పాస్టర్స్ ఫెలో షిప్ అధ్యక్షులు ఎబినేజర్ శాస్త్రీ, పాస్టర్ ఎం.జ్యోతి రాజు, పాస్టర్ బీరపోగు యోహాను, పాస్టర్ జీ.పాల్ ఆశీర్వాదం, పాస్టర్ పీవీ.రాజు, పాస్టర్ జా న్ ప్రభుకిరణ్, పాస్టర్ తేళ్ళ శ్యామ్‌బాబు, పాల్గొ న్నారు. సుమారు 10 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



క్రిస్మస్ వేడుకల్లో విశ్వాసులు, సందేశమిస్తున్న పాస్టర్ జయ్‌పాల్

16 మద్యం షాపులకు సీల్

చింతలపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 16 మద్యం షాపులకు మంగళవారం సాయంత్రం సీలు వేయించినట్టు సీఐ అశోక్ తెలిపారు. ఎన్నికల అనంతరం వీటిని తెరుస్తారన్నారు. ఎవరూ ఎన్నికల నిబంధనను అతిక్రమించరాదని హెచ్చరించారు. ఎక్సైజ్ దాడుల్లో ఎస్ఐ అబ్దుల్ ఖలీల్ పాల్గొన్నారు.

పచ్చగడ్డితో పశువులకు పుష్కలంగా పోషకాలు

బుట్టాయగూడెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పచ్చగడ్డిలో పశువులకు అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయని డాక్టరు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం వెంకటరామన్నగూడెం విస్తరణ సంచాలకులు డాక్టరు గోవిందరాజులు అన్నారు. తూర్పు రేగులకుంటలో బుధవారం పర్యటించి క్షేత్రస్థాయిలో పశుగ్రాస పంటలను పరిశీలించారు. పచ్చగడ్డితో పశువులు ఆరోగ్యంగా ఉంటాయని పాలుత్పత్తి పెరుగుతుందన్నారు. డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ ప్రదర్శనను ప్రారంభించారు. శాస్త్రవేత్తలు డాక్టరు కరుణశ్రీ, డాక్టరు దేవివరప్రసాద్‌రెడ్డి, డాక్టరు రేఖ, డాక్టరు విజయలక్ష్మీ, డాక్టరు పెదబాబు, హెచ్‌వో నవీన మణిమాల, వంశీ, రైతులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

వరి, మొక్కజొన్న, అపరాలను సాగు చేస్తున్న రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఎంఏవో డి.ముత్యాలరావు తెలిపారు. రెడ్డిగణపవరం, బుట్టాయగూడెంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వరికి ఎకరాకు రూ.500, మొక్కజొన్నకు రూ.483, అపరాలకు ఎకరాకు రూ.60 చొప్పున రైతు సేవా కేంద్రాల్లో ప్రీమియం చెల్లించాలన్నారు.



పశుగ్రాస పంటను పరిశీలించిన గోవిందరాజులు

● లింగపాలెం : పంటలను మార్చడం వలన తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుందని ఏడీఏ నాగబాబు రైతులకు సూచించారు. సింగగూడెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పొలంలో నాటిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌తో పాటు అనేక వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ ఇస్తుందన్నారు. ఏవో మురళీకృష్ణ రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : పశుగ్రాసం పెంచి పాల ఉత్పత్తి ద్వారా ఆదాయం పొందే రైతుల్ని ప్రభుత్వం ఆదుకునేందుక రాయితీలు కల్పిస్తున్నట్లు ఏవో కె.గంగాధరం తెలిపారు. స్వర్ణవారిగూడెంలో, దర్భగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మినుము, పెసర, మొక్కజొన్న పంటల్ని సాగుచేసే రైతులు పంటల భీమా చెయించుకోవాలని ఏవో చెప్పారు. కులంతో సంబంధం లేకుండా 5 ఎకరాల్లోపు రైతులకు బిందు, తుంపర సేద్యం చేసుకునేందుకు ప్రభుత్వం 90శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల్ని సాగు చేసే రైతులకు తగిన ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఉద్యాన అధికారి నవీన మణిమాల, బాబురావు, రైతులు బిక్కిన వెంకటేశ్వరావు, అచ్యుతరావు, టి.రాములమ్మ, ఎస్.ప్రసాద్, సిహెచ్. పాటేశ్వరి ఉన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు



ఏలూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఎస్పీ ఆవులయ్య

ఏలూరు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడైనా సారా విక్రయించినా, అక్రమంగా మద్యం కల్గి ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ జిల్లా ఎస్పీ ఎ ఆవులయ్య ఆదేశించారు. ఏలూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆవులయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్‌లో నమోదు అయిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మార్పీ ధరల కంటే అదనపు ధరలు వసూలు చేస్తే సహించేది లేదని, బెల్టుషాపులు ఎక్కడ నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో నిఘా పెంచాలని ఎస్పీ సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

చింతలపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం చింతలపూడి, లింగపాలెం మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ ఏర్పాట్లను నూజివీడు ఆర్డీవో ఎం.వాణి బుధవారం పరిశీలించారు. చింతలపూడి మండలంలో 232, లింగపాలెం మండలంలో 48 ఓట్లు ఉన్నాయి. చింతలపూడి మండలంలో నలుగురు ఎన్నికల సిబ్బందిని నియమించి ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ షకీలున్నీసా, వీఆర్వోలు ఉన్నారు.

● కొయ్యలగూడెం : స్థానిక జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను తహసీల్దార్ చెల్లన్నదొర, ఎస్సై చంద్ర శేఖర్ పరిశీలించారు. మండలంలో 113 ఓట్లు ఉన్నాయన్నారు. ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని ఎన్నికల నిబంధనలను ఉల్లంగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

● జంగారెడ్డిగూడెం : ఎమ్మెల్సీ ఎన్నికలు సంబంధింన సమాగ్రిని ఆర్డీవో కార్యాలయం వద్ద ఎన్నికల సిబ్బందికి ఆర్డీవో ఎంవీ రమణ అందచేశారు. జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలో 1074 మంది ఓటర్లు ఉన్నారని ఆర్డీవో తెలిపారు. డివిజన్ పరిధిలో పది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు బుట్టాయగూడెం పోలింగ్ కేంద్రాన్ని ఆరీవో పరిశీలించారు. డీఎస్పీ రవిచంద్ర, తహసీల్దారు కె.స్లీవజోజి, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

● పోలవరం :ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగు డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ , ఎఎస్ఐ నాగేశ్వరరావు, తహసీల్దారు సాయిరాజు, డిప్యూటీ తహసీల్దారు కె.శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలోని ఒక ఇంట్లో చెల్లాచెదురైన వస్తువులు

భూప్రకంపనలు

జిల్లాలో సెకన్ల పాటు కంపించిన భూమి

ఉలిక్కిపడిన జనం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గోదావరి పరీవాహక ప్రాంతంతో పాటు మిగతా ప్రాంతాల్లో బుధవారం భూమి స్వల్పంగా కంపించింది. ఉదయాన్నే ఎవరి పనిలో వారుం డగా 7.45 గంటల సమయంలో ఐదు నుంచి పది సెకన్లపాటు భూమి స్వల్పంగా కంపించింది. భద్రాచలంకు సమీపాన కుక్కునూరు, వేలేరు పాడు మండలాల్లో 15 సెకన్లకుపైగా రెండు విడతలుగా భూప్రకంపనలు రావడంతో స్థానికు లు ఉలిక్కి పడ్డారు. వంట గదుల్లో వస్తువులు కిందపడ్డాయి. కొందరు ఇళ్ల నుంచి బయటకు పరుగులుతీశారు. భూకంపం వచ్చిందంటూ పెద్ద ఎత్తున కేకలు వేశారు. చాలా మంది కాసేపు ఆందోళన చెందారు. కుక్కునూరు శివాలయంలోని ధ్వజస్తంభానికి ఉన్న గంటలు భూప్రకంపనల కారణంగా ఒక్కసారిగా మోగినట్లు భక్తులు చెబు తున్నారు. ప్రకంపనలు వచ్చే పావుగంట ముందు గ్రామంలో కోతులు ఆందోళనగా అటుఇటూ ఉరు కులు పెట్టినట్లు గమనించామని కొందరు చెబు తున్నారు. జీలుగుమిల్లి, టి.నర్సాపురం, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూ డెం, పోలవరం, బుట్టాయిగూడెం ప్రాంతాల్లో కొన్ని సెకన్లపాటు భూమి కంపించింది. వాస్తవా నికి పోలవరం ప్రాంతం భూకంపాలకు ఆస్కారం లేదు. కాని ఇక్కడ కూడా తొలిసారిగా బుధవారం సెకన్లపాటు స్వల్ప భూప్రకంపనలు కనిపించా యి. దీంతో ఆందోళన వ్యక్తమవుతుంది. గోదావరి పరివాహక ప్రాంతంలో ఈమధ్య కాలంలో తొలి సారిగా ఇప్పుడు ప్రకంపనలు నమోదు కావడం పై అధికారులు సైతం నివ్వెరపోతున్నారు. ద్వారకాతిరుమల, ఏలూరు వంటి ప్రాంతాల్లో సెకన్ల పాటు భూప్రకంపనలు వెలువడగా స్థానికులు తొలుత దీనిని తేలిగ్గా తీసుకున్నారు. రెండోమారు ప్రకంపనలు రావడంతో భూకంపంగా నిర్ధారించి ఆందోళన చెందారు. 'ఉదయాన్నే అందరం కూ ర్చొని ఉండగా 7.45 గంటల ప్రాంతంలో ప్రకంప నలు వచ్చాయి. ఇదేంటి ఏదో అదురుతుందని ముందుగా అనుకున్నాం. ఆ తరువాత కొద్ది సేప టికే మా ఎదుటే ఉన్న టీపాయి, ఖాళీ కుర్చీలు సైతం కదలడం కనిపించింది. ఇదంతా కొన్ని సెకన్లపాటే ఉంది' అని ఆర్‌ఆర్ పేటకు చెందిన ఒక ఆసుపత్రిలో జనరల్ మేనేజర్ శివప్రసాద్ వెల్లడించారు. నగరంలో ఒకట్రెండు చోట్ల కూడా మాత్రమే కొందరికి ఈ అనుభవం ఎదురైంది. కొయ్యలగూడెం పట్టణంలోని అశోక్‌నగర్, కన్నాపురం, అంకాలగూడెం, దిప్పకాయలపాడు గ్రామాల్లో ప్రకంపనలు గమనించారు. గెడా సత్తిబాబు ఇంటి వద్ద తలుపులు కొట్టుకో వడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. కొయ్యల గూడెం పట్టణంలోని మండల పరిషత్ ఉద్యోగి స్వామి ఇంటి వద్ద పెంపుడు కుక్కలు యాజ మానుల వద్దకు వచ్చి అరిచినట్లు ఆయన తెలిపాడు. కామవరపుకోట మండలంలో పలు గ్రామాల్లో నివాసాలు, వీధుల్లోని వస్తువులు కద లికలు ఏర్పడడంతో కొందరు వీధుల్లోకి పరుగులు తీశారు. కొన్ని సెకన్ల అనంతరం ప్రకంపనలు ఆగిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం సుబ్బారెడ్డి కాలనీలో కొప్పాక శ్రీనివాసరావు కూర్చున్న కుర్చీతో పాటు గ్యాస్ బండ, సోఫా ఒకేసారి కదలడంతో ఇంట్లో వారు బయటకు పరుగులు తీశారు. నూజివీడు రూరల్ మండలం మీర్జాపురం, మండల కేంద్రమైన ఆగిరిపల్లి, చాట్రాయిలలో కూడా భూమిలో స్వల్ప ప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు నిర్ధారించారు. సాధారణంగా ఈ ప్రాం తాల్లో భూప్రకంపనలకు పెద్దగా ఆస్కారంలేదని, అయినప్పటికి ఇప్పుడు తొలిసారిగా స్వల్ప స్థాయిలో ప్రకంపనలు ఏర్పడడంతో ఆందోళన కలిగిస్తుందని స్థానికులు పేర్కొంటుండగా పెద్దగా భయపడాల్సిన అవసరంలేదంటూ అధికారులు చెబుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొద్ది సెకన్ల పాటు భూప్రకంపనలతో పలువురు భయపడ్డారు. రెండు, మూడు సెకన్లు ప్రకంపనలు గమనించినట్లు పలువురు చెప్పారు.

చలికాలం..జర జాగ్రత్త..



ఏలూరు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చలికాలంతో చల్లని వాతావరణం వణి కిస్తుంది .పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయి. ఈ కాలంలో ఆహ్లాదం మాటున జబ్బులు కూడా పొంచి ఉంటాయి. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు చలికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. శీతాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధిన బారినపడే ప్రమాదాలు ఉన్నాయి. వర్షాకాలం నుంచి శీతా కాలంలోకి మారుతున్న నేపథ్యంలో అప్పటి వరకూ వర్షా కాల వాతావరణానికి అనుకూలంగా ఉన్న మానవశరీరం తిరిగి శీతాకాల పరిస్థితు లను తట్టుకునే విధంగా ఉండడానికి వ్యాధి నిరోధక శక్తి ఎంతో అవసరం. ఆ శక్తి లేనప్పుడు వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. శీతాకాలంలో చల్లనిగాలులు, మంచువల్ల ఊపిరితిత్తుల్లో నిమ్ము వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. నరాలు బలహీనపడి రక్త ప్రసరణకు ఇబ్బందులు రావచ్చు. సాధారణంగా 50 ఏళ్ల పైబడిన వారిలో గుండె సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిలో ఈ పరి స్థితులు నెల కొని ఉంటాయి. ప్రస్తుతం శీతాకాలం రావడంతో ఎక్కువ మంది కఫంతో కూడిన దగ్గు, గొంతు నొప్పి, జలుబు, జ్వరం, వంటినొప్పులు వంటివి లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. కొందరికి ఎలర్జీ ఉండడంతో శరీరంపై దద్దుర్లు, దురదలు వస్తూ ఉంటాయి. ఈ కాలంలో ఆయాసం, ఉబ్బసం ఉన్నవారికి ఇబ్బందులు అధికంగా ఉంటాయి. ఈ ఏడాది సాధారణ శీతాకాల ఉష్ణోగ్రతలు కన్నా మరింత తగ్గువగా ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని వాతావరణ పరిశోధన శాస్త్రవేత్తలు వెల్లడిం చడంతో ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి .

ఇవి పాటించండి

శీతాకాలంలో ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా మారుతూ ఉంటాయి. ముఖాన్ని వెచ్చగా ఉంచు కోవడానికి స్కార్ఫ్ లేదా మాస్క్ ధరించాలి. రోగనిరోధక శక్తి పెంచుకోవడానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. తగినంత నిద్ర పోవాలి. రోజుకు ఒక గంటపాటు వ్యాయామం లేదా నడక అయినా చేయాలి. దీనివలన రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చు. తగినంత నీరు తాగి శరీరాన్ని హైడ్రేట్ చేసుకోవాలి. జలుబు, జ్వరాలు ఉన్న వారికి దూరంగా ఉండడం ఎంతో మంచిది. ఆయాసం ఉన్న వారు ఆవిరి పట్టాలి. చిన్న పిల్లలకు శరీరం వెచ్చగా ఉండేం వస్త్రాలను ధరింపజేసి ఉంచాలి. జలుబు, జ్వరం వస్తే వెంటనే వైద్యుల వద్దకు తీసుకువెళ్ళాలి.

నూజివీడులో ఫ్లెక్సీ కలకలం



ఏబీ వెంకటేశ్వరరావుకు మద్దతుగా ప్రచారం

నూజివీడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిస్టర్ జగన్‌రెడ్డి బీ కేర్‌ఫుల్.. ఆర్థిక నేరస్తుడు స్థానం జైలు అంటూ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు ఫొటోతో ఏలూరు జిల్లా నూజివీడు పట్టణ కూడళ్లలో ఫ్లెక్సీలు వెలిశా యి. స్థానిక టీడీపీ నాయకుల ఫొటోలతో కట్టి న ఫ్లెక్సీ చర్చనీయాంశమైంది. ఇటీవల మాజీ సీఎం జగన్‌రెడ్డి ఏబీ వెంకటేశ్వరరావును ఏక వచనంతో సంబోధిస్తూ విమర్శించిన నేపథ్యం లో ఈ ఫ్లెక్సీలు నూజివీడు పట్టణంలో వెలిసినట్లు తెలుస్తోంది. ఏబీ వెంకటేశ్వరరావు నూజివీడు స్థానికుడు కావడంతో ఆయనతో సన్నిహితంగా ఉండే నాయకులు వీటిని ఏర్పాటు చేసినట్లు సమాచారం.



చాట్రాయి మండలం ప్రజాదర్బార్‌లో అధికారులు



ముసునూరులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజా దర్బార్‌లో వినతుల వెల్లువ

నూజివీడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సారథి - మన వారధి పేరిట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రజా దర్బార్‌కు మంత్రి కొలుసు పార్థసారథి శ్రీకారం చుట్టారు. నూజి వీడు మండలం, నూజివీడు పట్టణంలో బుధవా రం జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. రెవెన్యూ సమస్యలు 869, పంచాయతీరాజ్ సమస్యలు 524, విద్యుత్ సమస్యలు 11, హౌసింగ్ 327 మొత్తం 1731 సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు టీడీపీ నాయకులకు దరఖాస్తులు అందించారు.

● చాట్రాయి: మండల పరిషత్ కార్యాల యంలో రెండో రోజు నిర్వహించిన ప్రజా దర్బా ర్‌కు ప్రజల నుంచి పలు వినతులు అందాయి. రెవెన్యూ సమస్యలపై 57, వివిధ సమస్యలపై 48 మొత్తం 105 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ప్రశాంతి, ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఆరుగొలనుపేటలో జమిందారీ భూములను పేద లమైన సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చెయ్యాలని అర్జీ సమర్పించారు. చను బండలో 4 ఎస్సీ కుటుంబాలకు నివేశన స్థలాలు, పక్కా ఇళ్ళు మంజూరు చెయ్యాలని కోనూరి సుజాత తదితరులు అర్జీ సమర్పించారు. బొట్టు లక్ష్మణరావు, నోబుల్‌రెడ్డి, కందుల కృష్ణ, నెక్కలపు వెంకటేశ్వరరావు, కట్టా దుర్గారావు పాల్గొన్నారు.

● ముసునూరు: ఎంపీడీవో కార్యాలయంలో రెండో రోజు తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రాణి ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. రెవెన్యూ సమస్యలతోపాటు ఇతర సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు వెల్లువలా వచ్చాయి. మొత్తం 927 అర్జీలు వచ్చినట్లు ఎంపీ డీవో తెలిపారు. పెన్షన్‌లకు 355, గృహనిర్మాణా నికి 338, కొత్త రేషన్ కార్డులకు 128, భూ సమస్యలపై 63, ఇళ్ల స్థలాల కోసం 36, విద్యుత్ సమస్యలపై 2, పంచాయితీరాజ్‌శాఖకు సంబం ధించి 4 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యాక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అన్నిశాఖల అధికారులు, సచివా లయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చాట్రాయిలో భూప్రకంపన

కంగారుపడిన జనం

చాట్రాయి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఉదయం సుమారు 7.15 సమయంలో భూమి స్వల్పంగా కంపిం చింది. వంట గదుల్లో ఉన్న వస్తువులు, టీ కప్పులు కదిలిన శబ్దాలు వచ్చాయని పలు వురు మహిళలు చెప్పారు. రేకుల షెడ్లలో ఉంటున్న వారు కొద్ది సేపు శబ్దాలు రావడంతో కోతులు దూకాయని అనుకున్నామని పలువురు చెప్పారు. సుమారు 50 ఏళ్ళ క్రితం రాత్రి 9 గంటల సమయంలో భూకంపం వచ్చిందని మళ్ళీ ఇప్పుడే భూప్రకంపనలు గమనించామని వృద్ధులు అంటున్నారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి

నూజివీడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 10,15వ వార్డుల్లో నివసిస్తున్న పేద లకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సచివాలయ అడ్మిన్‌కి నూజివీడు సీపీఎం జిల్లా కార్యదరి ్శవర్గ సభ్యుడు జి.రాజు వినతిపత్రం అందించా డు. 10వవార్డులో మొగలిచెరువు, మెరక ప్రాం తంలో 200 కుటుంబాలు 60 ఏళ్ల నుంచి అక్క డే నివసిస్తున్నారు. వారంతా నిరుపేదలు, పట్ట ణంలో వివిధ వృత్తులు చేసుకుంటూ జీవిస్తు న్నారు. సంవత్సరాలు గడుస్తున్నా వీరికి ఇళ్లప ట్టాల సమస్య పరిష్కారం కాలేదన్నారు. 15వ వార్డు ఎన్టీఆర్‌కాలనీ చివరిలో 22 కుటుంబాల వారు 20 ఏళ్ల నుంచి నివసిస్తున్నారు. వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. రెండు వార్డుల్లో డ్రెయి నేజీ, వీధిలైట్లు, రోడ్డుసమస్యలు పరిష్కరించా చాన్నారు. పట్టణ కార్యదర్శి ఎస్‌ఆర్ హను మాన్లు పాల్గొన్నారు.

భూవివాదంలో పొగాకు పంట నరికివేత



పొగాకు పంటను పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ, నాయకులు

ముసునూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో పొగాకు పంటను నరికేసిన సంఘటన ముసునూరులో మంగళవారం రాత్రి జరిగింది. బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గండిపూడి జార్జి, చెన్ను రాంబాబు మధ్య కొద్దికాలంగా భూ వివాదం ఉంది. రెండు రోజులు క్రితం జార్జి కుమారుడు గండిపూడి రవి పొగాకు పంటను సైతం నరికివేస్తానని బెదిరించాడని గ్రామ పెద్దలకు రాంబా బు తెలియజేశాడు. బుధవారం ఉద యం 70సెంట్లలో ఉన్న పొగాకు పంట సగానికి నరికేసి ఉందని బాధిత రైతు ముసునూరు పోలీసులకు, గ్రామ పెద్ద లకు తెలిపాడు. ఏఎస్‌ఐ నాగభూషణ రావు, సర్పంచ్ తనయుడు కొండేటి ఉదయ్‌కిరణ్, ఉపసర్పంచ్ తోట శ్రీని వాసరావు, చెన్ను సత్యనారయణ పొగాకు తోటను పరిశీలించారు. నెల రోజుల్లో కోతకు వచ్చే పొగాకు పంటను నరికేశారని బాధిత రైతు కన్నీటిపరవంతమయ్యాడు. ఈ సంఘట నపై రాంబాబు ఫిర్యాదు మేరకు విచారణ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

రెండు పాఠశాలల్లో ఎన్‌ఏఎస్ పరీక్షలు

చాట్రాయి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మర్ల పాలెం జడ్పీ హైస్కూల్, చనుబండ ఉషోదయ స్కూల్‌లో బుధవారం ఎన్‌ఏఎస్ పరీక్ష నిర్వహిం చారు. మర్లపాలెంలో 25 మంది, చనుబండలో 30 మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో బ్రహ్మాచా రి తెలిపారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ ఏఎస్) పరీక్ష ద్వారా విద్యార్థుల సమగ్ర అభి వృద్ధి, సమీక్ష, జ్ఞాన విశ్లేషణ చేయడం జరుగు తుందన్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేయబడిన పాఠశాలలో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తారని, ఏలూరు జిల్లాలో 45 పాఠశాలలో ఈ పరీక్ష జరిగిందన్నారు.

ఉత్తమ బోధన అందించాలి

ముసునూరు, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. గోగుల ంపాడులోని ఎంయూపీ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. ప్రభుత్వం అందించే సదుపా యాలను ఉపయోగించుకుని బాగా చదవి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులకు సూచించా రు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంకా వీడని తుఫాన్ కష్టాలు



చినపాలపర్రు వద్ద పొలాల నుంచి నీటిని ఇంజన్‌తో బయటకు తోడుతున్న దృశ్యం

ముదినేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ వాతావరణం ఇంకా వీడలేదు. వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గాలులు వీస్తూనే ఉండడంతో సార్వా వరి పంటకు భారీ నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ముదినేపల్లి ప్రాంతంలో బుధవారం కురిసిన భారీ వర్షం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఇప్పటికే నేలకొరిగిన వరి పైరుకు నష్టం కలిగే ప్రమాదం ఏర్పడింది. మండలంలో సుమారు ఐదువేల ఎకరాల్లో వరి పైరు నేలమట్టమయింది. ఇక ఇప్పటి వరకు ఆరబెట్టి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. తేమ శాతం 28 పైగా ఉండడంతో రూ.1.737కు అమ్మాల్సిన 75 కేజీల బస్తా ధాన్యం రూ.1500కు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి : వాతావరణం మార్పులతో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవ సాయాధికారి విద్యాసాగర్ అన్నారు. బుధవారం తాడినాడ, చిన తాడినాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి కోత యంత్రాలతో కోసిన ధాన్యాన్ని సురక్ష ప్రదేశాలకు తరలించాలన్నారు. మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్ మాట్లా డుతూ చేపల, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ లోపించకుండా నిరంతరాయంగా ఏరియేటర్లు తిరుగుతూ ఉండే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు సకాలంలో అందించాలి

కైకలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం పెన్షనర్లు విధిగా లైఫ్ సర్టిఫికెట్లు సకాలంలో అందించాలని జిల్లా ట్రెజరీ ఉపసంచాలకులు టి.కృష్ణ అన్నారు. కైకలూరు సబ్‌ట్రెజరీ కార్యాలయంలో పెన్ష నర్లతో బుధవారం సమావేశాన్ని నిర్వహిం చారు. సమావేశంలో పెన్షనర్లు పలు సమస్యలను ప్రస్తావించగా యుద్ధప్రాతిపాది కన పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

షష్ఠి ఉత్సవ కమిటీల నియామకం

ముదినేపల్లి/కలిదిండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవ స్థానంలో ఈనెల 6 నుంచి 18 వరకు జరుగనున్న షష్ఠి కల్యాణోత్సవాలకు ఉత్సవ కమిటీ ఏర్పాటయింది. ఈ మేరకు దేవ దాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా బొంగు రవికుమార్, వెనిగళ్ల సురేష్, నీలం శివ రమేష్, పరసా కృష్ణ, బూరుబోయిన సోవమ్మ, కొట్టి సుబ్బలక్ష్మి, దగాని నాగలక్ష్మి, బెజవాడ నాగ వెంకట రాధాకృష్ణ, పరసా రమేష్‌లను నియమించినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి తెలిపారు. కలిదిండి మండలం షష్ఠి ఉత్సవ కమిటీ సభ్యులుగా ఎం.బుల్లి వెంకయ్య, డి.నాగు, డి.రామలింగేశ్వరరావు, డి.రామకృష్ణ, ఆర్. రంగబాబు, కె.మధునాగు, జి.సూర్యనారా యణ నియమితులయ్యారని ఆలయ ఈవో శేఖర్ తెలిపారు.



కలిదిండిలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను

'వందరోజుల కార్యాచరణ' పునఃసమీక్షించాలి

» పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను

కలిదిండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల కార్యాచరణ ప్రణా ళికను పునఃసమీక్షించాలని డెమోక్రటిక్ పీఆర్టీ యూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను అన్నారు. కలి దిండిలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి బుధ వారం ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ ఎస్సీఈఆర్టీ పదో తరగతి పబ్లిక్ పరీక్షల దృష్ట్యా రూపొందించిన వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో సిలబస్ పూర్తి కాకుండానే కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించడం హేతుబద్దంగా లేద న్నారు. సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహణ ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. డెమోక్రటిక్ పీఆర్టీయూ నాయకులు దేవానంద్, ఎండి.సనా వుల్లా, మోకా రామారావు, జె.బాలాజీ, జి.నాగ రాజు, డివి.నాగేశ్వరరావు, వి.కుమార స్వామి, జి.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంతాన నాగేంద్రస్వామి ఆలయ పునప్రతిష్ఠ



కైకలూరు, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): కైకలూరు శాంప్‌డెయిన్ కాల్వగట్టుపై వెలసిన సంతాన నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠా, ఆలయ పునఃనిర్మాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. గణపతి, నాగబంధ, మయూర వాహన సహిత సంతాన నాగేంద్ర శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు, పూర్ణాహతి కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి దివ్య శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్, ఎంపీపీ అడవి కృష్ణ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి చెక్ అందజేస్తున్న మంత్రి

సీఎం సహాయ నిధికి రూ.50 లక్షల విరాళం

నూజివీడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో వివిధ సంస్థలు, పలువురు ప్రముఖులు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50,56,236 అందజేశారు. సంబంధిత చెక్‌లను మంత్రి కొలుసు పార్థసారథి సచివాల యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి బుధవారం అందజేశారు.

పేరెంట్స్ డే ఆహ్వానం



ఆహ్వాన పత్రికలతో విద్యార్థులు

ముసునూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రమణక్కపేట జడ్పీపాఠశాలలో ఈ నెల 7న జరిగే పేరెంట్స్ డే కార్యక్రమానికి ఆహ్వాన పత్రికలను విద్యార్థులు తయారు చేసినట్లు హెచ్‌ఎం పీవీఎస్.రామకృష్ణారావు తెలిపారు. ఆహ్వాన పత్రికలను బుధవారం ప్రజా ప్రతి నిధులు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, దాతలకు హెచ్‌ఎం, పీఎంసీ ఛైర్మెన్ నీలికొండ రాజా అందజేశారు.

● చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 7న జరిగే మెగా పేరెంట్స్ డే కార్యక్రమానికి తల్లిదండ్రులకు ఆహ్వానాలు పలుకుతున్నారు. తుమ్మగూడెం ఉర్దూ పాఠ శాల హెచ్‌ఎం వెంకట్రావు ఆధ్వర్యంలో విద్యా ర్థులు బుధవారం ఇంటింటికి వెళ్ళి తల్లిదండ్రు లను ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్ర మంలో ఎస్‌ఎంసీ ఛైర్మన్ హసీనా. ఏఎస్‌ఎం, అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరంలో సారా స్థావరంపై బుధవారం దాడి చేసి 800 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ మస్తా నయ్య తెలిపారు. అక్కడి నుంచి పారిపోయిన నిందితుడు పిల్లి దుర్గాప్రసాద్ అలియాస్ దు ర్గారావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో సారా తయారీ, అమ్మకం దారుల పైనా, బెల్ట్ షాపులు నిర్వాహకులు, నల్ల బెల్లం వ్యాపారులు, బెల్లంఊట ఉన్న భూ యజమా నులపైనా కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. సారా, తయారీ అమ్మకాలు, బెల్ట్ షాపులు గురించి ప్రజలు ఫోన్ నెంబరు: 9949539933 సమాచారం ఇవ్వాలని, సమా చారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతా మని సీఐ అన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

ముదినేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పథకం అమలులో ఉపా ధ్యాయులు ఎటువంటి పొరపాట్లు లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు తెలిపారు. అల్లూరులోని జడ్పీ హైస్కూలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎస్‌ఎంసీ ఛైర్మన్ ఎస్.శ్యామల, కమిటీ సభ్యులతో కలసి బుధ వారం పరిశీలించారు. హెచ్‌ఎం రామో జీ, టీడీపీ నాయకులు పి.శివశంకర్, డి.శ్రీను, బీవీ రత్నం పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

కలిదిండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన వ్యక్తిపై అట్రా సిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంక టేశ్వరరావు తెలిపారు. కలిదిండి ఇందిర కాలనీకి చెందిన కె.ప్రభాకర్ అతడి స్నేహి తులు వెంకటాపురానికి చెందిన లేళ్ల సుబ్బా రావును మంగళవారం ఓ సెటిల్‌మెంట్ విషయంలో కులం పేరుతో దూషించి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రభా కర్ అతని స్నేహితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు.



ఇంట్లో పగులగొట్టిన ఇనుపబీరువా, చిందరవందరగా పడివున్న సామగ్రి

బీరువా పగులగొట్టి బంగారం చోరీ

కైకలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కైకలూరులో తాళం వేసిన ఇంటిలో అర్ధ రాత్రి దొంగలు పడి ఇంటిలోని బంగారం, వెండి, నగదును అపహరించారు. కైకలూరు 8వ వార్డులో కాల్వ గట్టుపై నివసిస్తున్న గొర్లి సీతారామయ్య తన భార్యతో కలిసి మంగళవారం సాయంత్రం ఇంటికి తాళాలు వేసి విజయవాడలోని తన సోదరుడి అయ్యప్ప ఇరుముళ్ల కార్యక్రమానికి వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో సమీ పంలో ఉన్న బంధువులు సమాచారాన్ని అందించడంతో తిరిగి వచ్చారు. ఇంటిలోని ఇనుప బీరు వాను పగలగొట్టి నాలుగు కాసుల బంగా రం, 30 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదు అపహరించినట్టు గుర్తించారు. టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను తీసుకువచ్చి ఆధారాలను సేకరించారు. సీఐ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.